ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com


నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -336 పేజీలు - 08 వెల - 04/- శుక్రవారం 31 అక్టోబర్ 2025

# తుపాను నష్టం 5,265 కోట్లు

- తుపాను నష్టం రూ.5,265 కోట్లు
- వ్యవసాయ రంగానికి రూ.829 కోట్లు
- ఆర్అండ్‌బీకి రూ.2,079 కోట్ల మేర నష్టం
- ముందస్తు చర్యలతో నష్టాన్ని నివారించాం
- సకాలంలో విద్యుత్ పునరుద్ధరించాం
- సమన్వయంతో పనిచేయడంతో తప్పిన ముప్పు
- అధికారులతో సమీక్షించిన సిఎం చంద్రబాబు



అమరావతి, **అక్టోబర్-30 ఆంధ్ర ప్రగతి** 'మొంథా' తుపాను వల్ల రాష్ట్రానికి రూ.5,265 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనా వేసినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. మొంథా తుపాను బీభత్సాన్ని ముందుగానే అంచనా వేశామని, అందుకే నష్టం తగ్గిందన్నారు. వ్యవసాయ రంగానికి రూ.829 కోట్లు, ఆర్అండ్‌బీకి రూ.2,079 కోట్ల మేర నష్టం వాటిల్లిందని చెప్పారు. తుపాను వల్ల ఎవరూ ప్రాణాలు కోల్పోలేదన్న ఆయన.. 120 పశువులు మృత్యువాత పడినట్లు పేర్కొన్నారు. నీటిపారుదల శాఖకు సంబంధించి ఈసారి నష్టం తక్కువే ఉందన్నారు. తుపాను నష్టంపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. నష్టం వివరాలను అధికారులు ఆయనకు వివరించారు.

మిగతా 2లో.



## రికార్డ్ చేజింగ్ తో వరల్డ్ కప్ ఫైనల్లోకి

- మహిళల ప్రపంచకప్ సెమీస్‌లో ఆస్ట్రేలియాపై భారత్ ఘన విజయం
- చరిత్రలోనే అత్యధిక స్కోరు ఛేదించి ఫైనల్‌కు చేరిన టీమిండియా
- అజేయ సెంచరీతో జట్టును గెలిపించిన జెమీమా రోడ్రిగ్స్
- మూడోసారి ప్రపంచకప్ ఫైనల్లో అడుగుపెట్టిన భారత మహిళల జట్టు

న్యూఢిల్లీ, **అక్టోబర్-30 ఆంధ్ర ప్రగతి** మహిళల వన్డే ప్రపంచకప్ చరిత్రలో టీమిండియా అద్భుతం సృష్టించింది. అసాధ్యమనుకున్న లక్ష్యాన్ని సుసాధ్యం చేస్తూ, డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాను చిత్తు చేసి ఫైనల్లోకి అడుగుపెట్టింది. నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియం వేదికగా గురువారం జరిగిన సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియాపై 5 వికెట్ల తేడాతో భారత్ చారిత్రక విజయం సాధించింది.

మిగతా 2లో.

## సూప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్

### రాష్ట్రపతి నోటిఫికేషన్ విడుదల



న్యూఢిల్లీ, **అక్టోబర్-30 ఆంధ్ర ప్రగతి** :సూప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. నవంబర్ 24వ తేదీన జస్టిస్ సూర్యకాంత్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు.

మిగతా 2లో.

## పొలాల్లోకి డిప్యూటీ సిఎం

### కృష్ణాజిల్లా అవనిగడ్డలో పర్యటించిన డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్

- 46 వేల హెక్టార్లలో వరికి నష్టం కలిగింది
- 14 వేల హెక్టార్లలో దెబ్బతిన్న ఉద్యాన పంటలు
- బాధిత రైతులతో మాట్లాడి భరోసా ఇచ్చిన పవన్ కళ్యాణ్



విజయవాడ, **అక్టోబర్-30 ఆంధ్ర ప్రగతి** ముందస్తుగా తీసుకున్న చర్యలతో తుఫాన్ నష్ట నివారణ కొంత వరకు తగ్గించగలిగామని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు చూపు కారణంగా చాలా జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. ప్రజలకు ఎలర్ట్ మెసేజ్‌లు కూడా పంపామని.. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో బాగా నష్టం జరిగిందని వెల్లడించారు. అన్ని జిల్లాల కలెక్టర్‌లు, ప్రభుత్వ యంత్రాంగం బాగా పని చేసిందని కొనియాడారు. కృష్ణా జిల్లాలోని అవనిగడ్డ నియోజకవర్గంలో మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటించారు.

మిగతా 2లో.

## రైతులకు తోడుగా నిలబడాలి

### పార్టీ నేతలకు జగన్ పిలుపు

- -తుపాన్‌తో వరిపంటకు తీవ్ర నష్టం
- పైరు పొట్ట దశలో ఉండగా తుపాను దెబ్బ
- - 15 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి





## యువతకు ఉద్యోగాల గేట్‌వేగా 'నైపుణ్యం' పోర్టల్

- ప్రతి నెల జాబ్ మేళాలు: ముఖ్యమంత్రి చంద్రబాబు
- నైపుణ్యాభివృద్ధితో పాటు ఉన్నత విద్యకు సహకారం
- ఆర్టీఐహెచ్‌తో విద్యార్థుల ఆవిష్కరణల అనుసంధానం
- నైపుణ్యాభివృద్ధి శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

## తిరుమల కల్తీ నెయ్యి కేసు

### చిన్న అప్పన్న రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు



తిరుమల, **అక్టోబర్-30 ఆంధ్ర ప్రగతి** తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి కేసు కీలక మలుపు తిరిగింది. కల్తీ నెయ్యి సరఫరా వెనుక భారీ కుట్ర ఉన్నట్లు సిట్ అధికారులు గుర్తించారు. నాటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సన్నిహితుడు చిన్నఅప్పన్న అరెస్టుతో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ మేరకు అప్పన్న రిమాండ్ రిపోర్టులో కుట్ర కోణాలను సిట్ ప్రస్తావించింది. 2022 తితిదే కొనుగోళ్ల విభాగం జీఎంను అప్పన్న సంప్రదించారు. నెయ్యి సరఫరా చేసే భోలేబాబా డెయిరీ యాజమాన్యానికి ఫోన్ చేశారు.

మిగతా 2లో.



## రైతులకు వేదన మిగిల్చిన తుఫాన్

- అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలి
- వివరాలు ఎప్పటికప్పుడు మంత్రులకు చేరవేయాలి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎం రేవంత్ రెడ్డి
- నేడు వరంగల్,లో సిఎం పర్యటన

హైదరాబాద్, **అక్టోబర్-30 ఆంధ్ర ప్రగతి** ఇది వరి కోతల కాలం..కానీ అనుకోని ఉపద్రవం రైతులకు ఆవేదన మిగులుస్తోందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అధికారుల అందరి సెలవులు రద్దు చేసి క్షేత్రస్థాయిలో పర్యటించేలా చూడాలని కలెక్టర్లకు ఆదేశించారు. ఈదురు గాలులతో విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. మొంథా తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, అధికారులతో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

మిగతా 2లో.

## నేడు తెలంగాణకేబినేట్ విస్తరణ

### అజారుద్దీన్ కోసం ప్రత్యేకం రాజ్‌భవన్ దర్బార్ హాలులో ఏర్పాట్లు



హైదరాబాద్, **అక్టోబర్-30 ఆంధ్ర ప్రగతి** : తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైంది. శుక్రవారం మధ్యాహ్నం 12:15 గంటలకు కొత్త మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. రాజ్‌భవన్‌లో కేబినెట్ మంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ క్రికెటర్ అజారుద్దీన్ ఒక్కరే ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ క్రమంలో ప్రభుత్వం ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ప్రమాణస్వీకారోత్సవం జరిగే రాజ్‌భవన్ దర్బార్ హాల్‌ను ప్రోటోకాల్ అధికారులు పరిశీలించారు. మంత్రి ప్రమాణ స్వీకారానికి సీటింగ్ తదితర ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు.

మిగతా 2లో.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# తుపాను నష్టం 5,265 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి కుటుంబాన్ని, ఇంటినీ జియోట్యాగింగ్ చేయగలిగాం. తుపాను వల్ల మారుతున్న పరిణామాలకు తగ్గట్లుగా నిర్ణయాలు తీసుకున్నాం. గతంలో విద్యుత్ సరఫరా ఆగితే 10 గంటల వరకు వచ్చేది కాదు. ప్రస్తుతం విద్యుత్ సరఫరా ఆగినా 3 గంటల్లోనే పునరుద్ధరణ జరిగింది. అధికారులు అందరూ నిబద్ధతతో పని చేశారు. చాలా సంతోషంగా ఉందన్నారు. . ఓ వైపు వర్షం పడుతున్నా.. కూలిన చెట్లను ఎప్పటికప్పుడు తొలగించి ఇబ్బందులు లేకుండా చేశారు. గతంలో చెట్లు కూలితే.. తొలగించేందుకు వారం పట్టేది. ప్రకృతి విపత్తులను ఎవరూ ఆపలేరు.. ముందస్తు చర్యల వల్ల నష్టాన్ని తగ్గించవచ్చని చంద్రబాబు తెలిపారు. మొంథా తుపాన్ మనతో దాగుడుమూతలు ఆడి.. సమస్యలు సృష్టించిందని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. అయితే టెక్నాలజీ సాయంతో ఈ తుపాన్ నష్టాన్ని తగ్గించామని ఆయన చెప్పారు. అంతర్వేది వద్ద తీరం దాటడంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురిశాయన్నారు. శాటిలైట్ ఇమేజ్‌ల ఆధారంగా తుపాన్ పరిస్థితిని అంచనా వేశామన్నారు. అంతర్వేది వద్ద తీరం దాటి రాష్ట్రంలో భారీ వర్షాలు కురిశాయని చెప్పారు.అయితే కాకినాడలో ఈ తుపాన్ క్రాస్ చేస్తుందని అనుకున్నామని.. కానీ చివరకు నరసాపురం వద్ద తీరం దాటిందని సీఎం చంద్రబాబు వివరించారు. వారం రోజుల్లోనే పరిస్థితులను చక్కదిద్దామన్నారు. అన్ని శాఖల సమన్వయంతో పని చేశామని.. అయితే అనుకున్న చోట కాకుండా వేరే ప్రాంతాల్లో వర్షాలు కురిశాయని వివరించారు. ఈ తుపాన్ తీరం దాటినా.. తెలంగాణలో వర్షాలు అధికంగా కురిశాయని తెలిపారు. గతంలో బుడమేరు వరదను సైతం ఎదుర్కొన్నామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

భారీ వర్షాల కారణంగా ఎక్కడా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చేశామన్నారు. విపత్తుల సమయంలో అన్నింటినీ సరిచేశామని చెప్పారు. ఇక గ్రామ, వార్డు సచివాలయాలను యాక్టివ్ చేశామన్నారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాలో అధికంగా వర్షాలు పడ్డాయని తెలిపారు. వర్షాల వల్ల వరదలు వచ్చాయని.. పులిచింతల వద్ద భారీగా వరద నీరు వచ్చి చేరిందని వివరించారు. పంట నష్టంపై నివేదిక అందజేయాలని అధికారులను సీఎం చంద్రబాబు కోరారు. ఐదు రోజుల్లో పంట నష్టంపై నివేదిక అందజేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఈ తుపాన్ కారణంగా.. వరి, మొక్కజొన్న, పత్తి, అరటి, ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిన సంగతి తెలిసిందే.

# రైతుల కోసం రంగంలోకి ఉప ముఖ్యమంత్రి

(మొదటి పేజీ తరువాయి)

కోడూరు మండలం కృష్ణాపురం గ్రామంలో పర్యటించారు. 'మొంథా' తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కూడా ఉన్నారు. అలాగే పంట నష్టపోయిన రైతులను పరామర్శించారు. మొంథా తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా పంట నష్టంపై ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను తిలకించారు. అనంతరం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... మొంథా తుపాను ప్రభావంతో 46 వేల హెక్టార్లలో వరి, 14 వేల హెక్టార్లలో ఉద్యానవన



పంటలు దెబ్బ తిన్నాయని వెల్లడించారు. చెట్టు మీద పడి కోయ సుబ్బారావు అనే వ్యక్తి చనిపోవడం బాధాకరమన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలకు బియ్యం ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించామని అన్నారు. ఇళ్లకు వెళ్లే సమయంలో కూడా ఒక్కో కుటుంబానికి మూడు వేల రూపాయలు ఇస్తున్నామని చెప్పారు. డ్రైన్ల పూడికతీతల ద్వారా నీరు నిల్వ లేకుండా చేశామన్నారు. ముందస్తుగా తీసుకున్న చర్యల వల్ల నేడు నష్టం చాలా వరకు తగ్గిందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఆక్వా రైతుల ఇబ్బందులు తన దృష్టికి వచ్చాయని.. సీఎం చంద్రబాబుతో మాట్లాడి పరిష్కారం కోసం కృషి చేస్తామని స్పష్టం చేశారు. గ్రామాల్లో రోడ్లు పాడైతే యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తామన్నారు. రెండు రోజుల్లో మొత్తం చెత్తను క్లీన్ చేసేలా వేలాది మంది సిబ్బంది పని చేస్తున్నారని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

# రైతులకు తోడుగా నిలబడాలి

## పార్టీ నేతలకు జగన్ పిలుపు

అమరావతి, **అక్టోబర్-30 ఆంధ్ర ప్రగతి**

తుపాను కారణంగా పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని.. ముఖ్యంగా వరి రైతులు తీవ్రంగా నష్టపోయారని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మొంథా తుపాను నేపథ్యంలో పార్టీ నేతలతో వైఎస్ జగన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను ప్రభావంపై పార్టీ నేతలతో చర్చించారు. పైరు పొట్ట దశలో ఉన్నప్పుడు తుపాను దెబ్బపడింది. దీనివల్ల దిగుబడులు బాగా దెబ్బతింటాయి. నేలకొరిగిన పంట తిరిగి నిలబడ్డం కష్టమయ్యే పరిస్థితి.

దాదాపు 25 జిల్లాల్లో ప్రభావం చూపింది. ఉన్న సమాచారం ప్రకారం 15 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. 11 లక్షల ఎకరాల్లో వరి పంటకు నష్టం దాటిల్లింది. 1.14 లక్షల ఎకరాల్లో పత్తి, 1.15 లక్షల ఎకరాల్లో వేరు శనగ, 2 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 1.9 లక్షల ఎకరాల్లో హార్టికల్చర్ పంటలు దెబ్బతిన్నాయి. పార్టీ పరంగా రైతులకు తోడుగా నిలబడాలని వైఎస్ జగన్ పిలుపునిచ్చారు. మన ప్రభుత్వంలో ఆర్బీకేల వ్యవస్థ అప్రమత్తంగా ఉండేది. ప్రతి పంటకూ ఇ-క్రాప్ చేసే వాళ్లం. గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు సమన్వయం తో గట్టిగా పనిచేసేది. ఉచిత పంటలబీమాతో రైతులకు భరోసా ఉండేది. 80 లక్షల మంది రైతులు ఉచిత పంటల బీమా అందుబాటులో ఉండేది. 70 లక్షల ఎకరాల పంట బీమా పరిధిలో ఉండేది. ఇవాళ ప్రీమియం కట్టిన రైతులు 19 లక్షలమందికి మాత్రమే బీమా అందుబాటులో ఉంది. మిగిలిన రైతుల పరిస్థితి ఏం కావాలి. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు మనం అండగా ఉండాలన్నారు. 16 నెలల్లో అల్పపీడనలు, వాయుగుండాలు, తుపాన్లు కారణంగా 16 వచ్చాయి. ఎంతమందికి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందింది, నష్టపోయిన రైతులను ఎంతమందిని ఆదుకున్నారు చూస్తే.. గుండుసున్నాయే కనిపిస్తుంది. ఏ రైతునూ ఆదుకున్న పరిస్థితి లేదు. ఇ-క్రాప్ అందించిన పరిస్థితి కూడా లేదు. వాళ్లు వేసిన అరకొర లెక్కల ప్రకారమే 5.5 లక్షలమంది రైతులకు రూ.600 కోట్లు పెండింగ్‌లో పెట్టారు. మిర్చికి క్వింటాలుకు రూ.11,781కి కొనుగోలు చేస్తామన్నారు ఒక్క రూపాయికూడా రైతుకు ఇవ్వలేదు. పొగాకును కొనుగోలు చేస్తామ న్నారు దిక్కూ మొక్కూ లేదు. మామిడిని కిలో రూ.12లకు కొనుగోలు చేస్తామన్నారు. ఒక్క రైతుకూ మంచి చేయలేదు. తర్వాత హెక్టారుకు రూ.50వేలు ఇస్తామన్నారు. అదికూడా ఇచ్చిన పాపాన పోలేదని జగన్ విమర్శించారు.

# యువతకు ఉద్యోగాల గేట్‌వేగా 'నైపుణ్యం' పోర్టల్

## నైపుణ్యాభివృద్ధి శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, **అక్టోబర్-30 ఆంధ్ర ప్రగతి**


యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తూనే, వారి ఉన్నత విద్యకు ప్రభుత్వం సహకరిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూసే వారి కోసం రూపొందించిన 'నైపుణ్యం' పోర్టల్ ఉద్యోగాల గేట్‌వేగా ఉండాలని అధికారులకు సూచించారు. 2029 నాటికి 20 లక్షలు ఉద్యోగాలు అందించాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని సాకారం చేసేలా అధికారులు కృషి చేయాలని ముఖ్యమంత్రి అన్నారు.

ఇకపై ప్రతీ నెలా, ప్రతీ నియోజకవర్గంలో జాబ్ మేళాలు నిర్వహించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. నవంబర్‌లో జరిగే భాగస్వామ్య సదస్సులోగా 'నైపుణ్యం' పోర్టల్‌ను ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని ఆయన సూచించారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందిన వారికి ఇక నుంచి అధికారికంగా ధ్రువపత్రాలు జారీ చేయాలని అన్నారు.

గురువారం సచివాలయంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్‌తో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులు సమీక్షకు హాజరయ్యారు. నైపుణ్యం పోర్టల్, జాబ్ డ్యాష్ బోర్డ్, వివిధ కోర్సులు, ఉద్యోగావకాశాలు తదితర అంశాల గురించి సమీక్షలో చర్చించారు.

### క్లస్టర్ల ఆధారంగా నైపుణ్య శిక్షణ : లోకేశ్

క్లస్టర్ బేస్డ్ అప్రోచ్ ద్వారా నైపుణ్యాలను పెంచేలా ప్రయత్నిస్తున్నామని, స్పేస్, ఆక్వా, క్వాంటం లాంటి రంగాల్లో సంస్థలు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించేలా కార్యాచరణ చేపట్టినట్టు మంత్రి లోకేశ్ ముఖ్యమంత్రికి తెలిపారు. మొత్తం 15 క్లస్టర్ల ద్వారా పరిశ్రమలకు మానవ వనరులను అందించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని ముఖ్యమంత్రికి వివరించారు. ఈ విధానంపై ఆస్ట్రేలియాలో అధ్యయనం చేసి అమలు



చేస్తున్నామన్నారు. దేశ విదేశాల్లో ఉద్యోగాలు ఎక్కడ లభిస్తున్నాయో అందరికీ తెలిసేలా నైపుణ్య పోర్టల్ అభివృద్ధి చేయడమే కాకుండా నైపుణ్య కల్పనలో దేశ, విదేశాలకు చెందిన సంస్థలను సంప్రదించాలని అధికారులకు ముఖ్యమంత్రి నిర్దేశించారు.

విశ్వవిద్యాలయాలు, జాతీయ-అంతర్జాతీయ విద్యా సంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకుంటే ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఏ లబ్ధి పొందకుండా నిరుద్యోగులుగా ఉన్నవారికి ప్రయోజనం చేకూర్చేలా 'నైపుణ్యం' పోర్టల్‌ను తీర్చిదిద్దాలన్నారు. అభ్యర్థులు ఏ రంగంలో తమకు ఉద్యోగం, ఉపాధి కావాలో ఆ అవకాశాన్ని పొందేలే వివరాలు పోర్టల్‌లో పొందుపరచాలని ముఖ్యమంత్రి సూచించారు.

### అన్ని శాఖలు, విభాగాల డేటా అనుసంధానం

ఇప్పటివరకు రాష్ట్రంలో నిర్వహించిన జాబ్ మేళాల ద్వారా 1,44,000 మందికి ఉద్యోగాలు లభించాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. నైపుణ్యం పోర్టల్ నుంచి ఏఐ ద్వారా అభ్యర్థులు తమ రెజ్యూమ్‌ను రూపొందించుకునే వెసులుబాటు కల్పించినట్టు వెల్లడించారు. వాట్సప్ ద్వారా ఉద్యోగావకాశాల గురించి సమాచారం ఎప్పటికప్పుడు అందిస్తామని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి అన్ని శాఖలు, విభాగాల డేటా బేస్‌ను సమీకృతం చేసి నిజమైన నిరుద్యోగులను గుర్తిస్తున్నామని అధికారులు వివరించారు.

ఎక్కడ, ఏ రంగంలో శిక్షణ అందిస్తున్నాం, జాబ్ మేళాలు ఏ ప్రాంతంలో నిర్వహిస్తున్నాం, ఏయే సంస్థల్లో ఎలాంటి ఉద్యోగ ఖాళీలు ఉన్నాయనే దానిపై పోర్టల్ నుంచి అభ్యర్థులకు సమాచారం అందేలా తీర్చిదిద్దామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఉద్యోగార్థులు ఇంటర్వ్యూలకు సిద్ధమయ్యేలా ఏఐ సిమ్యులేటర్ సైతం నైపుణ్యం పోర్టల్‌లో అందుబాటులో ఉందన్నారు.

### విదేశీ భాషల్ని నేర్చుకునేలా శిక్షణ

'పోర్టల్‌లో ఐటీఐలు, పాలిటెక్నిక్‌లు, ఇంజినీరింగ్ కళాశాలలు, యూనివర్సిటీలు, వివిధ విద్యా సంస్థలతో పరిశ్రమలు, సంస్థలను అనుసంధానించాలి. విద్యా సంస్థలకు ఫ్యూచర్ ట్రెండ్స్ తెలిసేలా చేయాలి. ప్లేస్మెంట్ వివరాలనూ ట్రాకింగ్ చేసేలా ఉండాలి. స్కిల్ టెస్టింగ్‌కు కూడా అవకాశం కల్పించాలి. పాఠశాల స్థాయిలో విద్యార్థుల నూతన ఆవిష్కరణలను మరింత ఉన్నతీకరించేలా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో అనుసంధానించాలి. విదేశాల్లో ఉద్యాగావకాశాలు సులభంగా పొందేందుకు వీలుగా ఆయా దేశాల స్థానిక భాషలను నేర్చుకునేలా శిక్షణ అందించాలి. ఏపీ ఎన్ఆర్టీ ద్వారా ఉద్యోగ సమాచారం పొందేలా చూడాలి. నైపుణ్యం పోర్టల్ ద్వారా ఏపీలో యువత అందరికీ ఏ రంగంలో నైపుణ్యం కావాలో దానికి సంబంధించిన శిక్షణ, ప్రస్తుతమున్న సామర్థ్యాన్ని మెరుగుపరుచుకునేలా పునఃశిక్షణ, ఉత్తమ శిక్షణ అందించాలి' అని ముఖ్యమంత్రి అధికారులకు నిర్దేశించారు.

# రైతులకు వేదన మిగిల్చిన తుఫాన్

(మొదటి పేజీ తరువాయి)

వివిధ జిల్లాల్లో కురిసిన వర్షాలు, జరిగిన నష్టాన్ని జిల్లా కలెక్టర్లు సీఎంకు వివరించారు. దెబ్బతిన్న పంటలు, రహదారులకు సంబంధించిన ప్రాథమిక వివరాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.కేంద్ర ప్రభుత్వం నుంచి పొందే వరదసాయం అంశాలపై అధికారులతో సీఎం చర్చించారు. శుక్రవారం వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహిస్తానని సీఎం రేవంత్ తెలిపారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఇవాళ్టి వరంగల్ పర్యటనను వాయిదా వేసుకున్నట్లు చెప్పారు. తుపాను ప్రభావిత జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని.. దానికి అవసరమైన అన్ని ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని సీఎం తెలిపారు. మొంథా తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. 16 జిల్లాలపై తుఫాను ప్రభావం ఉంటుందని తెలిపారు. దీనిపై ముందస్తు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. రోడ్లపై బ్రిడ్జిలు, లోలెవల్ కాజ్‌వేల వద్ద వరద నీరు నిలిచినా, రోడ్లు దెబ్బతిన్నా.. ట్రాఫిక్‌ను డైవర్ట్ చేయాలని అధికారులకు సీఎం రేవంత్ సూచించారు. అవసరమైతే తప్ప ప్రజలు రోడ్లపైకి రాకుండా అవగాహన కల్పించాలని తెలిపారు. అవసరమైనచోట అత్యవసర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వరంగల్‌లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అవసరమైన చోట హైడ్రా సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. 24 గంటలు ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించాలని అధికారులను ఆదేశించారు.

అధికారులతో సమన్వయం చేసుకుని ఉమ్మడి జిల్లాల మంత్రులు, కలెక్టర్లను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. అలాగే.. కలెక్టర్లు ఎప్పటికప్పుడు సమాచారాన్ని సంబంధింత జిల్లా ఇంచార్జ్ మంత్రికి తెలియజేయాలని పేర్కొన్నారు. కాలువలు, వాగులు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో స్థానిక ప్రజలను అప్రమత్తం చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. ప్రాజెక్టుల ఇన్ ఎ÷-లో, అవుట్ ఎ÷-లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని వివరించారు. ప్రాణనష్టం, పశు నష్టం, పంట నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఏ ఒక్కరి ప్రాణాలకు నష్టం జరగడానికి వీల్లేదని తేల్చి చెప్పారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఇవాళ్టి వరంగల్ ఆకస్మిక పర్యటన వాయిదా వేసుకున్నట్లు రేవంత్ వెల్లడించారు. శుక్రవారం వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అధికారులు బాధితులను ఆదుకునే ప్రయత్నం చేయాలని పేర్కొన్నారు. ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇందుకు అవసరమైన అన్ని ప్రణాళికలను సిద్ధం చేసినట్లు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# వరల్డ్ కప్ ఫైనల్లోకి

(మొదటి పేజీ తరువాయి)



జెమీమా రోడ్రిగ్స్ (127 నాటౌట్) అద్భుత సెంచరీతో చెలరేగడంతో, 339 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ మరో ఓవర్ మిగిలి ఉండగానే 341/5 స్కోరుతో ఛేదించింది. ఈ విజయంతో భారత్ మూడోసారి ప్రపంచకప్ ఫైనల్‌కు చేరగా, ఆస్ట్రేలియా 15 మ్యాచ్‌ల విజయ పరంపరకు తెరపడింది. అంతేకాకుండా, మహిళల, పురుషుల వన్డే ప్రపంచకప్ నాకౌట్ చరిత్రలోనే ఇది అత్యధిక విజయవంతమైన ఛేదనగా రికార్డు సృష్టించింది. 2015 పురుషుల ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికాపై న్యూజిలాండ్ ఛేదించిన 299 పరుగుల రికార్డును భారత్ అధిగమించింది. భారీ లక్ష్య ఛేదనలో భారత్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్లు షఫాలీ వర్మ (10), స్మృతి మంధన (24) త్వరగా ఔటవ్వడంతో 47 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన జెమీమా రోడ్రిగ్స్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (89)తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దింది. వీరిద్దరూ ఆసీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ మూడో వికెట్‌కు 167 పరుగుల రికార్డు భాగస్వామ్యం నెలకొల్పారు. మహిళల ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై ఇదే అత్యధిక భాగస్వామ్యం కావడం విశేషం.హర్మన్‌ప్రీత్ ఔటైన తర్వాత కూడా జెమీమా ఒత్తిడికి గురికాలేదు. దీప్తి శర్మ (24), రిచా ఘోష్ (26), అమన్‌జోత్ కౌర్ (8 బంతుల్లో 15 నాటౌట్) కీలక సమయాల్లో రాణించి ఆమెకు మద్దతుగా నిలిచారు. అమన్‌జోత్ ఫోర్‌తో విజయ లాంఛనాన్ని పూర్తి చేయగా, జెమీమా ఆనందంతో కన్నీటిపర్యంతమైంది. ఇది ఆమెకు ప్రపంచకప్‌లో తొలి సెంచరీ కావడం గమనార్హం.అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా నిర్ణీత 50 ఓవర్లలో 338 పరుగుల భారీ స్కోరు చేసింది. ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (119) సెంచరీతో కదం తొక్కగా, ఎల్లీస్ పెర్రీ (77), ఆష్లే గార్డనర్ (45 బంతుల్లో 63) మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడారు. భారత బౌలర్లలో నల్లపురెడ్డి శ్రీ చరణి, దీప్తి శర్మ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా, అద్భుతమైన పోరాట పటిమతో విజయం సాధించిన భారత జట్టుపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది.

# సూప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటి వరకు ఈ పదవిలో ఉన్న బీఆర్ గవాయ్ నవంబర్ 23వ తేదీన రిటైర్ కానున్నారు. అయితే సుప్రీంకోర్టులో జస్టిస్ సూర్యకాంత్ సీనియర్ న్యాయమూర్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో తదుపరి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్‌ను నియమించాలంటూ కేంద్ర న్యాయశాఖకు జస్టిస్ బీఆర్ గవాయ్ బుధవారం సిఫార్సు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ సిఫార్సు చేసిన కొన్ని గంటల్లోనే జస్టిస్ సూర్యకాంత్ నియామకానికి రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు. ఈ విషయాన్ని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ తన ఎక్స్ ఖాతా వేదికగా వెల్లడించారు. ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్‌కు కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ శు భాకాంక్షలు తెలియజేశారు. భారత రాజ్యాంగం ప్రసాదించిన అధికారాలను వినియోగించి.. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను రాష్ట్రపతి నియమించారని తెలిపారు. 2025, నవంబర్ 24వ తేదీన భారత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపడతారని పేర్కొన్నారు. చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా బాధ్యతలు చేపట్టనున్న ఆయకు హృదయపూర్వక అభినందలు, శుభాకాంక్షలు తెలిపారు.

# తిరుమల కల్తీ నెయ్యి కేసు

## చిన్న అప్పన్న రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి కిలో నెయ్యిపై రూ.25 కమిషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందుకు భోలేబాబా డెయిరీ యాజమాన్యం నిరాకరించింది. దీంతో ఆ డెయిరీపై అనర్హత వేటు వేసేలా చిన్నఅప్పన్న కుట్రకు తెరలేపారు. డెయిరీని తనిఖీ చేయాలంటూ తితిదే అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. డెయిరీపై అనర్హతవేటు వేసేలా అజ్ఞాతవ్యక్తులతో పిటిషన్లు వేయించారు. చిన్నఅప్పన్న కుట్రతో బోలేబాబా డెయిరీ నుంచి నెయ్యి సేకరణను తితిదే నిలిపివేసింది. ఆ స్థానంలో ప్రీమియర్ అగ్రిఫుడ్స్ సంస్థ ప్రవేశించి.. రూ.138 ఎక్కువ కోట్ చేసింది. పోటీ లేకపోవడంతో కాంట్రాక్టు దక్కించుకుంది. కల్తీ నెయ్యి కేసులో అప్పన్నను 24వ నిందితుడిగా చేర్చింది.

# నేడు తెలంగాణకేబినేట్ విస్తరణ

(మొదటి పేజీ తరువాయి)

22 నెలల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు 11 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఆ తరువాత మరో ముగ్గురికి మంత్రులుగా అవకాశం ఇవ్వడంతో కేబినెట్‌లో మంత్రుల సంఖ్య 15కు చేరింది. ఇక మిగిలిన మూడు మంత్రి పదువులపై కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు చేసింది. ఈ మూడు మంత్రి పదవుల్లో మైనారిటీ వర్గానికి చెందిన వ్యక్తికి అవకాశం ఇవ్వాలని హైకమాండ్ భావించింది. ఈ క్రమంలో మాజీ క్రికెటర్ అజారుద్దీన్ పేరును అధిష్టానం ఖరారు చేసింది. అజారుద్దీన్‌కు హోం, మైనారిటీ శాఖ ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇక మంత్రివర్గంలో మరో రెండు ఖాళీలకు అధిష్టానం ఎప్పుడు గ్రీన్ సిగ్నల్ ఇస్తుందో చూడాలి మరి. కాగా.. మైనారిటీని మంత్రివర్గంలోకి తీసుకోవాలని ఎప్పటి నుంచో ఆలోచన ఉందని.. అందులో భాగంగానే అజారుద్దీన్ కేబినెట్‌లోకి తీసుకుంటున్నట్లు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ చెప్పిన విషయం తెలిసిందే. అయితే తనకు హామీ ఇచ్చి పక్కన పెట్టారని రాజగోపాల్ రెడ్డి పదేపదే విమర్శలు చేస్తున్నా ఆయనకు మాత్రం అవకాశం దక్కకపోవడం గమనార్హం.

# మెంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించిన జెసి.

**పంట నష్టం అంచనా కార్యక్రమాన్ని రేపటిలోగా పూర్తి చేయాలి.**

**జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్.**





**ఆంధ్ర ప్రగతి చాగలమర్రి, ఆళ్లగడ్డ, అక్టోబర్ 30:**
జిల్లాలో మెంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలకు సంబంధించి గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ చాగలమర్రి, ఆళ్లగడ్డ మండలాలలో పంట నష్టం అంచనా ప్రక్రియను ప్రారంభించారు.
ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ మాట్లాడుతూ....జిల్లాలో మెంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ప్రతి పంటలకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. నంద్యాల జిల్లాలోని ప్రతి మండలంలో వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి పంట నష్టం అంచనాను రేపటిలోగా పూర్తిచేసి నివేదిక జిల్లా ఉన్నతాధికారులకు పంపాలన్నారు. పంట నష్టం అంచనాకు సంబంధించి ఒక్క రైతు కూడా మిస్ కాకుండా జాగ్రత్తగా పకడ్బందీగా కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. ఈ క్రాప్ బుకింగ్ ద్వారా పంట నష్టం అంచనా ఈజీగా నమోదు చేయవచ్చునని వ్యవసాయ అధికారులు ప్రతి రైతును సంప్రదించి ఆధార్ కార్డులు పరిశీలించి పంట నష్టం అంచనా కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. మెంథా తుఫాన్ ప్రభావంతో పంట దెబ్బతిన్న ప్రతి రైతుకు నష్టపరిహారం ఇవ్వడం జరుగుతుందని ఇందులో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ చాగలమర్రి మండలంలోని పుట్లూరు, నేలంపాడు, మరియు ఆళ్లగడ్డ మండలంలోని మిట్టపల్లి గ్రామంలో
తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించి సంబంధిత అధికారులకు పంట నష్టం అంచనా వేయడంలో తగు సూచనలు సలహాలు ఇస్తూ దిశ నిర్దేశం చేశారు.

# నీట మునిగిన పంట పొలాలను

## పరిశీలించిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 30:**
తుఫాన్ ప్రభావంతో నంద్యాల జిల్లా పలు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా అన్ని మండలాల్లో కూడా పంట నష్టం అంచనాలను రైతుల వారీగా ఏపీ ఏఐఎంఎస్ అప్లికేషన్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. గురువారం బండి ఆత్మకూరు మండలంలోని సంత జూటూరు, ఏ.కోడూరు గ్రామాలలోని రైతు పంట పొలాలను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రైతు తన పంట నష్టం వివరాలను గ్రామ వ్యవసాయ అధికారి ద్వారా "ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్మెంట్ సిస్టం" యాప్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. ఏ రైతు కూడా ఈ ప్రక్రియలో మినహాయించబడకూడదని, పంట నష్టం అంచనాలు 100 శాతం ఖచ్చితంగా ఉండేలా అధికారులు పని చేయాలని ఆదేశించారు. తుఫాన్ ప్రభావంతో పొంగిన వాగులు, వంకల నీరు రైతుల పొలాల్లోకి ప్రవహించడంతో విస్తారమైన పంట నష్టం సంభవించిందన్నారు. రైతుల ఆందోళనలను అర్థం చేసుకుని, వారికి తగిన భరోసా కల్పించారు. గ్రామస్థాయి బృందాలు ప్రతి రైతు పొలాన్ని సందర్శించి నష్టం వివరాలను నమోదు చేసి, ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని రెండు రోజులలోపే పూర్తి చేసి, తుది జాబితాను సామాజిక తనిఖీ నిమిత్తం ప్రతి రైతు సేవా కేంద్రంలో ప్రదర్శించాలన్నారు. కలెక్టర్ సంత జూటూరు, ఏ.కోడూరు గ్రామాల్లోని పంట పొలాల్లో నిలబడి పంటల స్థితిని, నీటి మునిగిన పొలాలను స్వయంగా పరిశీలించారు. ప్రతి పొలం దగ్గర రైతులతో మాట్లాడుతూ, వరి పంట దెబ్బతిన్న పరిస్థితిని నిశితంగా పరిశీలించారు. మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు కలెక్టర్ వెంట ఉన్నారు.

# డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద రోగులకు

# అన్ని వైద్య సేవలు ఉచితంగా చేయాలి.

**డిడిసి కమిటీ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 30:**
డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద రోగులకు అన్ని వైద్య సేవలు ఉచితంగా ఇవ్వాలనిజిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ జిల్లాలో ఉన్న అన్ని నెట్వర్క్ ఆసుపత్రులకు సూచించారు.
గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి చాంబర్ నందు డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ స్కీం గురించి వైద్యాధికారులతో డిడిసి(జిల్లా డిసిప్లైనరీ కమిటీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. వెంకటరమణ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం వైద్య అభివృద్ధికి అధిక నిధులు ఖర్చు చేయడం జరుగుతుందని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద రోగులకు అన్ని వైద్య సేవలు ఉచితంగా చేయాలన్నారు. ఇకనుంచి ఎన్టీఆర్ వైద్య సేవ కింద రోగుల నుంచి ఎలాంటి డబ్బులు వసూలు చేయరాదని అన్ని వైద్య సేవలు ఉచితంగా చేయాలన్నారు. అలా చేయని యెడల పదింతల వరకు అపరాధ రుసు విధించడం తోపాటు ఆసుపత్రి లైసెన్సు రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఏ ఆసుపత్రులు అయితే గ్రీవెన్స్ ఉన్నాయో ఆ ఆసుపత్రులకు అపరాధ రుసుం విధించడం జరిగింది. ఇందులో ముఖ్యంగా కన్సల్టేషన్ చార్జీలు, ఇన్వెస్టిగేషన్ కు, ఎమర్జెన్సీ సేవలు పూర్తి ఉచితంగా అందించాలన్నారు. ఈ సందర్భంగా ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యం వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవ కింద పెండింగ్లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించేటట్లు చూడాలని డిఎంహెచ్వోను కోరారు.
ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ ఓ.లలిత, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ వై.రూపేంద్ర నాథ్ రెడ్డి, జిల్లా మేనేజర్ ఆర్ శ్రీధర్ గ్రీవెన్స్ ఉన్న నెట్వర్క్ ఆసుపత్రుల యాజమాన్యం, తదితరులు పాల్గొన్నారు.

# కెసి కెనాల్ లో పేరుకుపోయిన మట్టి మరియు చెత్తను తొలగించిన షేక్ మహమ్మద్ రఫీ.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 30:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆదేశాల మేరకు ఈరోజు 19 వ వార్డు లోని పొన్నాపురం గ్రామం నందు కార్తీక మాసం సందర్భంగా పూజలకు ఇబ్బందిగా మారి కెసి కెనాల్ లో పేరుకుపోయిన మట్టి మరియు చెత్త ను 19 వ వార్డు ఇంచార్జ్ షేక్ మహమ్మద్ రఫీ (మున్నా) తన సొంత నిధులతో జెసిబి ని తీసుకొని వచ్చి మొత్తం క్లియర్ చేయడం జరిగినది ఇందుకు వార్డులోని ప్రజలు మంత్రి ఎన్ఎండి ఫరూక్ కు, 19వ వార్డు టీడీపీ ఇంచార్జ్ షేక్ మొహమ్మద్ రఫీ (మున్నా) కు ధన్యవాదాలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో కెసిపి పుల్లయ్య , అడ్వకేట్ హరి తదితరులు పాల్గొన్నారు.

# మెంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించిన జెసి.

**పంట నష్టం అంచనా కార్యక్రమాన్ని రేపటిలోగా పూర్తి చేయాలి.**

**జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్.**



**ఆంధ్ర ప్రగతి దొర్నిపాడు, అక్టోబర్ 30:**
జిల్లాలో మెంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలకు సంబంధించి గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ దొర్నిపాడు మండలం, కోటకొండ గ్రామంలో పంట నష్టం అంచనా ప్రక్రియను ప్రారంభించారు.
ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ మాట్లాడుతూ....ప్రతి రైతు తన పంట నష్టం వివరాలను గ్రామ వ్యవసాయ అధికారి ద్వారా "ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్మెంట్ సిస్టం యాప్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. ఏ రైతు కూడా ఈ ప్రక్రియలో మినహాయించబడకూడదని, పంట నష్టం అంచనాలు 100 శాతం ఖచ్చితంగా ఉండేలా అధికారులు పని చేయాలని ఆదేశించారు. నంద్యాల జిల్లాలోని ప్రతి మండలంలో వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి పంట నష్టం అంచనాను రేపటిలోగా పూర్తిచేసి నివేదిక జిల్లా ఉన్నతాధికారులకు పంపాలన్నారు. పంట నష్టం అంచనాకు సంబంధించి ఒక్క రైతు కూడా మిస్ కాకుండా జాగ్రత్తగా పకడ్బందీగా కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. ఈ క్రాప్ బుకింగ్ ద్వారా పంట నష్టం అంచనా ఈజీగా నమోదు చేయవచ్చునని వ్యవసాయ అధికారులు ప్రతి రైతును సంప్రదించి ఆధార్ కార్డులు పరిశీలించి పంట నష్టం అంచనా కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. మెంథా తుఫాన్ ప్రభావంతో పంట దెబ్బతిన్న ప్రతి రైతుకు నష్టపరిహారం ఇవ్వడం జరుగుతుందని ఇందులో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ పంట నష్టం అంచనాల సేకరణకు సంబంధించి అధికారులకు తగు సూచనలు సలహాలు ఇస్తూ దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారులు, వ్యవసాయ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కుల వివక్ష అవివేకం..

# అధికారి పై తక్షణ చర్యలు చేపట్టాలి.

**-నల్ల బ్యాడ్జీలతో రెండవ రోజు నంద్యాల వాణిజ్య పన్నుల కార్యాలయంలో నిరసన.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 30:**
చిత్తూరు జిల్లా వాణిజ్య పన్నుల శాఖ సబ్‌డివిజనల్ జాయింట్ కమిషనర్ రవీంద్రనాథ్‌రెడ్డి కుల వివక్షతో ఉద్యోగులను అవమానించిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సూర్యనారాయణ ఇచ్చిన మూడు రోజులు నిరసన కార్యక్రమాల పిలుపు మేరకు రెండవ రోజు ప్రభుత్వ ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. బుధవారం భోజన విరామ సమయంలో వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కె. నాగేంద్రప్ప, కోశాధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ.. రవీంద్రనాథ్‌రెడ్డి తన వద్ద పనిచేసే సబ్‌ఆర్డినేట్లు ఏ. లవ్‌కుమార్, కే. భరత్‌లను కులం పేరుతో దూషించడం, చెప్పులు బయట పెట్టి లోపలికి రావాలని ఆదేశించడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని ఆగ్రహించారు. ఇలాంటి అవమానకర ప్రవర్తన చేసిన అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కోశాధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ..ఉన్నతాధికార హోదాలో కూర్చున్న వ్యక్తి ప్రజల సమస్యలు తెలుసుకుని ప్రభుత్వానికి సలహాలు ఇవ్వాలి కానీ ఇలా పెద్ద హోదాలో ఉండి ఉద్యోగులను కించపరచడం, కులాలను ఎత్తి చూపడం సభ్య సమాజం లో ఇటువంటివి సరియైనవి కాదని, ఇటువంటి అధికారులు ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవడం తప్ప ప్రజలకు సేవ చేయడంలో విఫలం అవుతారని, ఉన్నత హోదాలో ఉండి ఇలా కుల వివక్ష చూపించడం సిగ్గుచేటు చర్య అని, ప్రభుత్వం విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆందోళన కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షురాలు రిజ్వానా పర్వీన్, నగర కోశాధికారి వెంకట చక్రధర్, సంయుక్త కార్యదర్శి ఆర్. ప్రభావతి, ఏపీ సిటీ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దశరథ రామిరెడ్డి, ఏపీ సిటీ ఎన్‌జిఓ అధ్యక్షుడు కమలాకర్, ఎస్సి, ఎస్టి ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలు నిర్మల జ్యోతి తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామీణ నీటి పారుదల శాఖ ఉద్యోగులు బుల్లెట్ భాష, నిర్మల, సుబ్బరత్నమ్మ, సురేంద్ర, పుల్లయ్య, మోహన్, ఉదయ్, సుమన్, దీప, బల్వీర్, రాఘవేంద్ర, బాలరాజు, యశోద, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం జరిగే

# బస్సు జాతాను జయప్రదం చేయండి.

**ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలి.**

**నంద్యాల జిల్లాలో అగ్రికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి.**

**రాయలసీమ యూనివర్సిటీ అనుబంధంగా సంస్థ నంద్యాల జిల్లా లో ఏర్పాటు చేయాలి.**

**ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భార్గవ్.**



**ఆంధ్ర ప్రగతి డోన్ అక్టోబర్ 30:**
రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈనెల 22న ఇచ్చాపురంలో ప్రారంభమైన బస్సు జాతా నంద్యాల జిల్లాకి 7 8 9 తేదీల్లో బస్సు జాత నంద్యాల జిల్లాకు ప్రవేశించడం జరుగుతుంది కావున విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని బస్సు యాత్రను జయప్రదం చేయాలని స్థానిక బేతంచెర్ల పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి యన్న.ఉదయ్ కుమార్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భార్గవ్ యన్న పాల్గొన్నారు అనంతరం వాల్ పోస్టర్లు విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించాలని, కూటమి ప్రభుత్వం తీసుకొని వచ్చిన పి పి పి ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణను ఆపాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 22న ఇచ్చాపురంలో ప్రారంభమై నవంబర్ 12న అనంతపురంలో ముగింపు సభ. కావున నంద్యాల జిల్లాకు నవంబర్ 7,8,9 తేదీల్లో నంద్యాల జిల్లా ప్రవేశించడం జరుగుతుంది అని వారు అన్నారు. కావున ఏఐఎస్ఎఫ్ బస్సు జాతాను జయప్రదం చేయాలని పెద్ద ఎత్తున విద్యార్థులు తరలిరావాలని వారు పిలుపునిచ్చారు.

**డిమాండ్స్**

1) పెండింగ్ లో ఉన్న 6,400 కోట్ల రూపాయల ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయాలి.
2) ప్రభుత్వ మెడికల్ కళాశాలను 'పి పి పి విధానంలో ప్రైవేటీకరణ చేసే విధానాన్ని ఉపసంహరించుకోవాలి.
3) ప్రభుత్వ పాఠశాల విద్యను కాపాడాలి. మూసి వేయబడ్డ పాఠశాలలను పునః ప్రారంభించాలి.
4) ప్రవేట్ కార్పోరేట్ విద్యాసంస్థల ఫీజులతోపిడిని అరికట్టాలి.
5) పేద విద్యార్థులకు ఉన్నత పి.జి. విద్యను దూరం చేసే జి. ఓ.నెం.77 ను రద్దు చేయాలి.
6) కామన్ పీ.జీ సెట్ విధానాన్ని రద్దు చేయాలి.
7) రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 3480 ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలి.
8) ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్ మౌలిక వసతులు కల్పించి,విద్యార్థ మరణాన్ని అరికట్టి, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు3000/- కు పెంచాలి
9) ప్రతి మండలంలో జూనియర్ కళాశాల, డిగ్రీ, పాలిటెక్ని, ఐటిఐ కళాశాలలను నిర్మించాలి.
10) యూనివర్సిటీ కేంద్రాలలో విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించాలి.
11) నంద్యాల జిల్లాలో అగ్రికల్చర్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలి.
12) నంద్యాల జిల్లా కేంద్రంలో విద్యాశాఖ కు సంబంధించిన జిల్లా కార్యాలయాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలన్నారు

ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి ప్రదీప్ నాయకులు మధు ,లియాజ్, లక్ష్మణ్, రాము, జస్వంత్, సాయి, కిషోర్, శ్రీమన్నారాయణ , సూరజ్, ఖాజా తదితరులు పాల్గొనారు.

## కుందూ నదిపై దశాబ్దాలు గడిచిన నూతన బ్రిడ్జిని పూర్తి చేయని అధికారులు.

### తుఫాను వల్ల శిధిలావస్థకు చేరిన పాత వంతెన.

### అటువైపు పోవు వాహనాల రాకపోకలు బంద్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 30:**నంద్యాల పట్టణం నుంచి నందమూరి నగర్ కు వెళ్లే కుందు నది పైన ఉన్న పాత బ్రిడ్జి ఇటీవల కురిసిన తుఫాను వర్షాలకు పూర్తిగా దెబ్బతినడంతో సిపిఐ నంద్యాల పట్టణ అధ్యక్షులు ప్రసాదు నూతన బ్రిడ్జి తక్షణమే పూర్తి చేయాలని కోరారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ గా అనేక సంవత్సరాలుగా దశాబ్దాల నాటి వంతెన ఎప్పుడు కూలుతుందో ఎప్పుడు శిధిలావస్థకు చేరుతుందో ఏదైనా ప్రాణ నష్టం జరిగితే ప్రభుత్వానిది అధికారులదే బాధ్యత అని ఎన్నోసార్లు కలెక్టర్ కి ప్రజా ప్రతినిధులకు తెలియజేయడం జరిగింది ఇప్పుడు తుఫాను వల్ల వంతెన శిధిలావస్థకు చేరింది వరద తగ్గింది గాని పాత వంతెన పై వాహనాల రాకపోకలు బంద్ చేసినారు. ఇప్పటికైనా ప్రభుత్వాధికారులు ప్రజాప్రతినిధులు మినిస్టర్ గారూ 90 శాతం పూర్తి అయిన కొత్త వంతెనను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ సమితిగా తెలియజేయడం జరుగుతుంది.

ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కాలనీవాసులు జాన్ అబ్దుల్లా రాంబాబు ఫక్రుద్దీన్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కుందు బ్రిడ్జి రోడ్డు మరమ్మత్తు పనులను పరిశీలించిన ఎన్ఎండి ఫయాజ్.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 30:**
మొంథా తుఫాన్ కారణంగా దెబ్బతిన్న , కుందు బ్రిడ్జి పై జరుగుతున్న రోడ్డు మరమ్మత్తు పనులను టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ గురువారం నాడు స్వయంగా వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ మొంథా తుఫాన్ ఉధృతి వల్ల కుందు బ్రిడ్జి పైనుంచి భారీగా నీరు ప్రవహించడంతో రోడ్డు తీవ్రంగా దెబ్బతిందని, దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని మంత్రి ఫరూక్ ఆదేశాల మేరకు బ్రిడ్జి పై రోడ్డు మరమ్మత్తు పనులను స్వయంగా పర్యవేక్షించడం జరిగిందని . ప్రజలకు రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు దెబ్బతిన్న ఈ రోడ్డును శరవేగంగా మరియు నాణ్యతతో మరమ్మత్తులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు ప్రజలు ఎదుర్కొంటున్న ఈ సమస్యను తక్షణమే పరిష్కరించడం ద్వారా నందమూరి నగర్ , వైయస్సార్ నగర్ మరియు ఇతర ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం సులభతరం అవుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో తాటికొండ బుగ్గ రాముడు, మరాఠీ సూరి, తాటికొండ మహేష్ , ఎమ్మార్వో శ్రీను, డిప్యూటీ ఎమ్మార్వో సంజీవ మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## కార్తీకమాస ఉత్సవాలకు బిసి రాజారెడ్డికి ఆహ్వానం.



**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె అక్టోబర్ 30:**
బనగానపల్లె మండలం యాగంటి క్షేత్రంలోని శ్రీ యాగంటి ఉమామహేశ్వర వాసవి సేవా సంఘం , ఆర్యవైశ్య నిత్యాన్నసత్రము వారి ఆధ్వర్యంలో నిర్వహించే కార్తీక మాస ఉత్సవాలకు బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. నవంబర్ 5వ తేదీ కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతము, కోటి దీపోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆయా కార్యక్రమాలకు హాజరుకావాలని వారు బిసి రాజారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పెద్దలు నూకల నాగరాజు, టంగుటూరి శీనయ్య, వెంకటసుబ్బయ్య , శ్రీరామ సుబ్రహ్మణ్యం, మారుతి రవికుమార్ పాల్గొన్నారు.

## డాక్టర్ రామిరెడ్డిని అభినందించిన మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి.

### 50 ఏళ్ల వైద్య సేవలకు ఘన సత్కారం



**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె అక్టోబర్ 30:**
కోవెలకుంట్ల పట్టణంలో 50 సంవత్సరాల పాటు వైద్య సేవలు అందించి, వేలాది పేద ప్రజలకు అండగా నిలిచిన డాక్టర్ రామిరెడ్డి వైద్య వృత్తికి అధికారికంగా విరమణ పొందిన సందర్భంగా బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి శాలువ కప్పి, పూలమాల వేసి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ..ఫీజు లేకున్నా చికిత్స చేసిన సేవాదృక్పథం అమూల్యం. గ్రామీణ వైద్య సేవలకు ఆయన పెట్టిన ముద్ర చిరస్మరణీయం. "వైద్యుడు దేవుడి రూపం" అనే మాటను నిజం చేసిన వ్యక్తి డాక్టర్ రామిరెడ్డి గారే అని కొనియాడారు.యువ వైద్యులు ఆయన సేవా భావాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.సత్కార కార్యక్రమంలో జిల్లా వైఎస్ఆర్ పార్టీ ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, వైఎస్ఆర్ పార్టీ రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి అంబటి రవికుమార్ రెడ్డి, కోవెలకుంట్ల మండల వైఎస్సార్ పార్టీ మాజీ కన్వీనర్ భీమిరెడ్డి ప్రతాపరెడ్డి, వైఎస్ఆర్ పార్టీ నాయకులు చిక్కేపల్లి ప్రసాద్ రెడ్డి తదితరులు. పాల్గొన్నారు.

## యాగంటి క్షేత్రంలో 5న పంచరత్నములు అనే ఉచిత నాటక ప్రదర్శన.

### కార్తీక పౌర్ణమి సందర్భంగా టీజీవి కళాక్షేత్రం కర్నూలు, అరుణ భారతి సాహితి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత నాటక ప్రదర్శనలు.

### నాటక ప్రదర్శనల వాల్ పోస్టర్లను ఆవిష్కరించిన బిసి రాజారెడ్డి.



**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె అక్టోబర్ 30:** ప్రముఖ శైవ క్షేత్రమైన యాగంటి నందు నవంబర్ 5వ తేదీ నిర్వహించనున్న పంచరత్నములు అనే ఉచిత నాటక ప్రదర్శనలకు సంబంధించిన వాల్ పోస్టర్లను బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి ఆవిష్కరించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా టీజీవి కళాక్షేత్రం కర్నూలు, బనగానపల్లె అరుణ భారతి సాహితి సంస్థ ఆధ్వర్యంలో యాగంటి క్షేత్రం నందు పంచరత్నములు అనే ఉచిత నాటక ప్రదర్శనల కార్యక్రమం ఏర్పాటు చేశారు. 5వ తేదీ బుధవారం రాత్రి 8 గంటల నుండి నాటక ప్రదర్శనలు ప్రారంభమవుతాయి. ఈ సందర్భంగా ప్రముఖ కళాకారులచే పడక సీను, శ్రీకృష్ణ తులాభారం, గయోపాఖ్యానం యుద్ధ సీను, భవాని సీను, సత్య హరిచంద్ర నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వీటికి సంబంధించిన వాల్ పోస్టర్లను బిసి రాజారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో యాగంటి పల్లె ఉపసర్పంచ్ బండి మౌళీశ్వర్ రెడ్డి, టిడిపి నాయకులు అమర్నాథ్ రెడ్డి, భూషన్న, తదితరులు పాల్గొన్నారు.

## రెండు రోజుల్లో నివేదికలు సిద్ధం చేయండి.





**ఆంధ్ర ప్రగతి మహానంది అక్టోబర్ 30:**
రెండు రోజుల లోపల పంట నష్ట అంచనాల నివేదికలు సిద్ధం చేయాలని రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారుల నుండి ఆదేశాలు జారీ అయినట్లు విశ్వసనీయ సమాచారం. అందులో భాగంగానే మహానంది మండల వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వర్ రెడ్డి మహానంది మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. క్రింది స్థాయి సిబ్బంది క్షేత్ర పరిశీలనకు వెళ్లాలని ఆదేశించారు. కానీ వారికి కొన్ని అడ్డంకులు కొన్ని చోటు చేసుకుంటున్నట్లు తెలుస్తుంది. వరి ,మొక్కజొన్న ఇతర పంటలు నీటిలో మునిగి ఉండడంతో పాటు కింది స్థాయి సిబ్బంది వెళ్లి పరిశీలన చేయడానికి కూడా నీటి ప్రవాహ ఉధృతి ఇంకా పంట పొలాల్లో కొనసాగుతూ ఉండడంతో కష్టతరంగా మారినట్లు సమాచారం. వాగులు వంకల్లో నీటి ప్రవాహం తగ్గితే పంట పొలాల్లో కూడా నీరు తగ్గే అవకాశం ఉన్న కొన్ని పొలాల్లో కొన్ని రోజులపాటు అలాగే నీరు నిలువ ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఏది ఏమైనా నివేదికలు సిద్ధం చేయాలని రెండు రోజుల లోపల ఉన్నత స్థాయి అధికారులకు నివేదికలు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నుండి ఆదేశాలు జారీ అయినట్లు తెలుస్తుంది. ఆ దిశగా అధికారులు మరియు సిబ్బంది క్షేత్రస్థాయిలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక యాప్ ను సిద్ధం చేసి వాటి ద్వారా పంట దెబ్బతిన్న ప్రాంతాలను ఫోటోలు తీసి సందేశాలు పంపాలని ఆదేశాల్లో పేర్కొన్నట్లు సమాచారం. క్రింది స్థాయిలో పరిశీలన, పర్యవేక్షణ, నివేదికల అనంతరం మండల స్థాయి, డివిజన్ మరియు జిల్లా స్థాయి అధికారులు పునః పరిశీలించే అవకాశం తెలుస్తుంది. పరిశీలన అనంతరం లోటుపాట్లను సవరించి పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయ సహకారాలు అందే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

## 40 లక్షలు ఆర్థిక సాయం అందించిన వేమూరి కావేరి ట్రావెల్స్ యాజమాన్యం.



**ఆంధ్ర ప్రగతి కర్నూలు,అక్టోబర్ 30:** ఈ నెల 24వ తేదీన చిన్నటేకూరు సమీపంలో జరిగిన బస్సు ప్రమాద దుర్ఘటన బాధితులకు కావేరి ట్రావెల్స్ యాజమాన్యం రూ.40 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. గురువారం ఉదయం కలెక్టర్ ఛాంబర్ లో కావేరి ట్రావెల్స్ ప్రతినిధులు మంత్రి టి.జి భరత్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్,జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి సమక్షంలో బస్సు దుర్ఘటనలో మరణించిన మరియు గాయపడిన వారికి చెక్కు రూపంలో మంత్రికి అందజేశారు.చిన్నటేకూరు సమీపంలో ఈ నెల 24 న జరిగిన కావేరీ బస్సు దుర్ఘటన లో మరణించిన వారికి రెండు లక్షల రూపాయల చొప్పున 17 మంది పెద్దవారు , ఇద్దరు చిన్న పిల్లలు మొత్తం 19 మందికి రూ.38 లక్షలు , తీవ్రంగా గాయపడిన నలుగురు కి రూ.50 వేల చొప్పున మొత్తం 2 రెండు లక్షలు మొత్తం రూ.40 లక్షల చెక్కును అందచేశారు.

## సంగం బ్యారేజికి తప్పిన ముప్పు: అనిత

విజయవాడ,**అక్టోబర్ 30 (గుడివాడ మెయిల్):** అధికారుల ముందస్తు చర్యలతో నెల్లూరు జిల్లా సంగం బ్యారేజీకి ముప్పు తప్పిందని హోం మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. సంగం బ్యారేజీకి కొట్టుకువచ్చిన 35 టన్నుల భారీ బోటును ఒడ్డుకు చేర్చడంలో అధికారుల పనితీరు ప్రశంసనీయమన్నారు. బ్యారేజీకి ప్రమాదం సంభవించకుండా కలెక్టర్, అధికారులు వెంటనే స్పందించారని తెలిపారు. సంగం బ్యారేజీ బోటు ప్రమాదానికి గురికాకుండా చర్యలు తీసుకున్నారన్నారు. నంద్యాల జిల్లా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి పర్యటించారు. బనగానప్లలె నియోజకవర్గంలో పర్యటించిన ఆయన.. కోవెలకుంట్ల, సంజామల మండలాల్లో దెబ్బతిన్న పంటను పరిశీలించారు. కోవెలకుంట్ల మండలం స్వామినగర్, బిజినవేములలో కూలిన మట్టి మి÷-దదెలను పరిశీలించారు. దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి.. పునరుద్ధరణ పనులు త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

## ప్రతిమాసము ఒక సందేశమే.

### డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే.

### నందికొట్కూరులో ప్రారంభమైన ధార్మిక సప్తాహం.



**ఆంధ్ర ప్రగతి నందికొట్కూరు అక్టోబర్ 30:**
మానవజన్మను చరితార్థం చేసుకొనుటకు ప్రతి మాసము ఒక సందేశమేనని, ప్రతి మనిషికి నియమనిష్టలు ఎంతో అవసరమని, మానవుడు బుద్ధిజీవిగా జీవించాలంటే సత్సంగత్వం ఎంతో అవసరమని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని నందికొట్కూరు కోటవీధిలోని శ్రీ వీరభద్ర భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం నందు ధార్మిక సప్తాహాన్ని వారు ప్రారంభించారు. మొదటిరోజు ప్రవచనంలో భాగంగా డమామ్ జగదీశ్ కార్తిక మాస విశిష్టత, దీప, దాన, ఉపవాస మహిమలను గురించి సోదాహరణంగా వివరించి భక్తులను ఆలోచింపజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సాపూరు శంకరప్ప మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానములు ఇంత మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం నందికొట్కూరు ప్రజల యొక్క సుకృతమని, కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమానికి స్కాలర్స్ విద్యాసంస్థల అధ్యక్షులు కాళ్లూరు లక్ష్మి కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో తితిదే హిందూ ధర్మ ప్రచారమండలి సభ్యులు అంబటి శివశంకర్ రెడ్డి, సాయిరాం విద్యాసంస్థల అధినేత పల్లాసుధాకర్ రెడ్డి, వ్యాపారవేత్త మాకాశేషయ్య, కార్పొరేటర్ వీరబొమ్మ రూపాశ్రీనివాస్, మహిళా మండలి సభ్యులు పార్వతమ్మ, వరలక్ష్మి, రజిని, లక్ష్మీదేవి, శారదమ్మ, అర్చకులు శేఖర్, ఎస్. చక్రధర్, మాకా గిరిధర్ బాబు, శరత్ కుమార్ పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ అధ్యక్షుడు సుబ్బారావు, కార్యదర్శి శరత్ కుమార్, రమేశ్ రెడ్డి, ప్రిన్సిపల్ వై.వెంకటేశ్వర్లుతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మిన్న.

## ఎస్ డి ఆర్ విద్యాసంస్థల అధినేత శనివారపు కొండారెడ్డి.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 30:**
నంద్యాల ఎస్ ఆర్ బి సి కాలనీలో ఉన్న పరివర్తన లైఫ్ సెంటర్ నందు హెల్పింగ్ హాండ్స్ సొసైటీ నిర్వాహకులు సద్దల చంద్రశేఖర్ రెడ్డి ఆహ్వానం మేరకు ఎస్ టి ఆర్ విద్యాసంస్థల అధినేత శనివారం కొండారెడ్డి అన్నదానం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ డి ఆర్ విద్యాసంస్థల అధినేత కొండారెడ్డి మాట్లాడుతూ.. దీర్ఘకాల వ్యాధితో బాధపడుతున్న ఈ చిన్నారులకు అనగా చేయడం అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు. ఈ రోజు నేను అయ్యప్ప దీక్షలో పరివర్తన లైఫ్ సెంటర్ కు రావడం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ కార్తీకమాసం లో ప్రతీ రోజు ఒక పూట అన్నదానం చేయడం దైవకార్యంతో సమానమని తెలిపారు. అలాగే ఈరోజు నా చేతుల మీదుగా ఈ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. దీర్ఘకాలం వ్యాధితో బాధపడుతున్న ఈ చిన్నారులకు ఈ కార్తిక మాసంలో నా వంతుగా ప్రతిరోజు ఒక పూట ఆకలి తీర్చడం సంతోషం గా ఉందని, ఈ. హెల్పింగ్ హాండ్స్ సొసైటీ నిర్వాహకులు సద్దల చంద్రశేఖర్ రెడ్డి కీ ఎప్పుడైనా సరే నా వంతు ఆర్థిక సహాయాన్ని అందిస్తానని తెలిపారు. హెల్పింగ్ హాండ్స్ సొసైటీ నిర్వాహకులు సద్దల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈరోజు మా ఆహ్వానం మేరకు ఈ దీర్ఘకాల వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగాహాజరైన ఎస్ డి ఆర్ విద్యాసంస్థల అధినేత కొండారెడ్డి కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఎంతోమంది నిరుపేదల విద్యార్థులలో జీవితాల్లో వెలుగులు నింపిన మీరు, ఈ కార్తీకమాసంలో అయ్యప్ప దీక్షలో ఆర్ బి సి కాలనీలో ఉన్న ఈ పరివర్తన లైఫ్ సెంటర్ నందు ఈ అన్నదాన కార్యక్రమం చేయడం అనేది చాలా విశిష్టత కూడిన విషయమని, ఈ కార్తీకమాసం లో ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం మీ వంతుగా సహాయ సహకారాలు ఈ హెల్పింగ్ అండ్ సొసైటీకి అందించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అన్నారు. ఈరోజు కొండారెడ్డి ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొనడం శుభపరిణామామని మా సొసైటీ తరఫున తరఫున ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామని తెలిపారు. అనంతరం లైఫ్ పరివర్తన నిర్వాకులు అబ్రహం మాట్లాడుతూ మీలాగే నంద్యాల్లో ఉన్న సేవ భావంతో ఉన్న విద్యాసంస్థలు అధినేతలు అన్నదాన కార్యక్రమాలకు ముందుకు రావాలని కోరుతున్నట్లు తెలిపారు. మా సొసైటీ పై ఎప్పుడు మీ సహాయ సహకారాలు ఉండాలని, కోరుతున్నట్లు తెలిపారు, అలాగే సేవాగుణంలో ముందు ఉండడం అనేది



ఒక్క ఎస్ డి ఆర్ విద్యాసంస్థల చైర్మన్ కొండారెడ్డి కు మాత్రమే చెందుతుందని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని ఈరోజు హెల్పింగ్ హాండ్స్ సొసైటీ నిర్వాహకులు సద్దల చంద్రశేఖర్ రెడ్డి ఆహ్వానం మేరకు వచ్చి దీర్ఘకాల వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల ఆకలి తీర్చినందుకు కొండారెడ్డి కు మా మా చిన్నారుల ద్వారా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం ఇలాగే మీరు మా సొసైటీ కి సహాయ సహకారాలు భవిష్యత్తులో అందించాలని ,మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం, ఈ అన్నదాన కార్యక్రమంలో ఎస్ డి ఆర్ విద్యాసంస్థల అధినేత శనివారపు కొండారెడ్డి, హెల్పింగ్ హాండ్స్ సొసైటీ నిర్వాహకులు సద్దల చంద్రశేఖర్ రెడ్డి గోపాల్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, శివ, శివ కుమార్, దస్తగిరి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



# పోలీసులే "రెవెన్యూ, ఆర్ అండ్ బి" అధికారులు.



**ఆంధ్ర ప్రగతి మహానంది అక్టోబర్ 30:**
మహానంది మండలంలో గత రెండు రోజులుగా మొంథా తుఫాను ప్రభావం వల్ల కురిసిన వర్షానికి లోతట్టు గ్రామాలు జలమయమై అతలాకుతం అయిన విషయం తెలిసిందే, అయితే నల్లమల అడవిలో నుండి వచ్చిన వరద నీరు ఎం సి ఫారం గ్రామ సమీపంలోని పాలేరు వాగు ప్రవహిస్తున్న విషయం తెలిసిందే, అయితే వాగులో పూడు, పెద్ద చెట్లు అడ్డంగా ఉండడంతో ప్రయాణికులు చూసి వెను తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుండడంతో అది గమనించిన మహానంది ఎస్ఐ ఎన్ రామ్మోహన్ రెడ్డి తమ సిబ్బందిని పంపించి జెసిపి ద్వారా మొత్తం తొలగించే విధంగా చర్యలు చేపట్టారు. వాగు వచ్చినప్పుడల్లా సంబంధిత అధికారులు వాగు వైపు తొక్కి కూడా చూడరని, మహానంది దేవస్థానం అధికారులు అయితే కనీసం భక్తులు పడుతున్న ఇబ్బందులను చూసైనా స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, రెవెన్యూ, ఆర్ అండ్ బి అధికారులు వెళితే మేము చేయించాల్సి వస్తుందో అని కనీసం తొక్కి చూడట్లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా మండలంలో మాత్రం పోలీసులే సహాయక చర్యల్లో ముందు ఉంటున్నారని పొగడ్తలు వినిపిస్తున్నాయి.

# ప్రతిమాసము ఒక సందేశమే.

**గౌరు చరితమ్మ, పాణ్యం శాసనసభ్యులు.**

**శివరామాలయంలో ప్రారంభమైన ధార్మిక సప్తాహం.**




**ఆంధ్ర ప్రగతి కర్నూలు అక్టోబర్ 30:** మానవజన్మను చరితార్థం చేసుకొనుటకు ప్రతి మాసము ఒక సందేశమేనని, ప్రతి మనిషికి నియమనిష్టలు ఎంతో అవసరమని, మానవుడు బుద్ధిజీవిగా జీవించాలంటే సత్సంగత్వం ఎంతో అవసరమని, ప్రతి మానవుడు తనశక్తికొలది దానధర్మాది క్రతువులు నిర్వహించాలని పాణ్యం శాసనసభ్యులు గౌరు చరితమ్మ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మాధవనగర్ లోని శ్రీశివరామాలయం నందు ధార్మిక సప్తాహాన్ని వారు జ్యోతి ప్రజ్వలనచేసి ప్రవచించారు. మొదటిరోజు ప్రవచనంలో భాగంగా డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని కార్తిక మాస విశిష్టత, దీప, దాన, ఉపవాస మహిమలను గురించి సోదాహరణంగా వివరించి భక్తులను ఆలోచింపచేశారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు జి. శేషాచలం, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, బాలాజీ సేవాట్రస్ట్ వ్యవస్థాపక అద్యక్షులు వేమారెడ్డి ధనంజయరెడ్డి, వార్డు ఇన్చార్జి రఘునాథ్ రెడ్డి, జనార్ధన రెడ్డి, తితిదే హిందూ ధర్మ ప్రచారమండలి సభ్యులు అంబటి శివశంకర్ రెడ్డి, పెద్ద సంఖ్యలో శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో తుఫాన్ బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ.

**మానవత్వం చాటుకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆకుల సలాం భాష.**

**20 కుటుంబాలకు ఏకలవ్య నగర్ లో నిత్యవసర సరుకులు అందజేత.**

**పేదవాళ్లకు సహాయం చేయడం దేవుడిచ్చిన గొప్ప వరం.**

**ఆకలితో ఉండే నిరుపేద కుటుంబాలకు అన్నం పెట్టడమే మహా పుణ్యం.**

**సమాజ సేవ కోసం నిరంతరం పాటు పడతా ఆత్మకూరు రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆకుల సలాం భాష.**




**ఆంధ్ర ప్రగతి ఆత్మకూరు అక్టోబర్ 30:**
రాష్ట్రంలో మొందా భారీ తుఫాన్ రాష్ట్ర ప్రజల్ని రైతులను వరదల తో ముంచి ఎత్తిన విషయాన్ని దృష్టిలో ఉంచుకొని నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరు పురపాలక సంఘంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని దృష్టిలో ఉంచుకొని సమాజ సేవ కోసం అన్ని విధాలుగా పాటుపడే విధంగా ముందుంటానని ది లిరియల్ ఎస్టేట్ ఆత్మకూర్ ప్రముఖ వ్యాపారి ఆకుల సలాం భాష అన్నారు. గురువారం పట్టణంలోని ఏకలవ్య నగర్ లో తుఫాన్ వరద బాధితులకు 20 కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆకుల సలాం భాష మాట్లాడుతూ ఆకలితో ఉన్న పేదవారికి అన్నం పెట్టడమే మహా పుణ్యం కార్యమని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తుఫానుతో రాష్ట్రమంతా ప్రజలు వరదల్లో విలవిలలాడుతున్నారని గుర్తు చేశారు ఆత్మకూరు పట్టణంలో వరద నీటి ముంపు కాలనీలను చూసి తమకు ఎంతో బాధ వేసిందని కొనియాడారు. నేను సంపాదించిన దాంట్లో నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం దేవుడిచ్చిన గొప్ప వరమని కొనియాడారు. ముఖ్యంగా ఏకలవ్య నగర్ లో నివాసముంటున్న నిరుపేదలు గుండ్లకమ్మ వాగు ఉద్రిక్తత తో వరద పెద్ద ఎత్తున రాత్రి సమయంలో రావడం జరిగిందని గుర్తు చేశారు. కుటుంబంలో ఆకలితో ఉన్న పేదలకు తమకు తోచినంత సహాయం అందించడం జరిగిందని అన్నారు. బియ్యం, చక్కెర, నూనె, గోధుమపిండి ఉప్మా రవ్వ కందిపప్పు కారం పసుపు టీ పొడి సబ్బులు తోపాటు ఇతర నిత్యవసర సరుకులు వరద బాధితులకు అందించి మానవత్వం చాటుకొని మరోసారి సమాజ సేవ కోసం ఆకుల సలాం భాష పాటుపడతారని నిరూపించుకోవడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలోపైజుల, సిరాజ్, ఆంజనేయులు, షఫీ, రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

# కోటి సంతకాలతో కూటమి కుట్రలను ఎండగడుదాం

## -మాజీ ఎమ్మెల్యే గంగుల.




**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల అక్టోబర్ 30:**
ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయాలన్న కూటమి ప్రభుత్వ కుట్రలను ప్రజలకు వివరించి వైఫల్యాలను ఎండగడదామని ఆళ్లగడ్డ మాజీ శాసనసభ్యులు గంగుల బీజేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి గారి పిలుపుమేరకు శిరివెళ్ల మండలం మహాదేవపురం గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజెంధ్రరెడ్డి నిర్వహించారు. గడపగడపకు తిరుగుతూ కూటమి వైఫల్యాలను వివరించడంలో భాగంగా మహదేవపురం గ్రామంలోని వైసీపీ యువనేత కే రాజేష్ గౌడ్ నివాసంలో మాజీ ఎమ్మెల్యే గంగుల మరియు ప్రముఖ వైసీపీ నాయకులు కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తేనేటీ విందును స్వీకరించారు. బీజేంద్రరెడ్డి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గంగుల మాట్లాడుతూ దివంగత మహానేత వైయస్ఆర్ మరియు జగనన్న పాలనలో ప్రజల సంక్షేమం ప్రజల గడప గడపకు చేరిందన్నారు, కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం పేదల కలలను దెబ్బతీసే ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రజల ఆరోగ్య హక్కును ధనికుల ఆస్తిగా మార్చే కుట్ర జరుగుతోందని తీవ్రస్థాయిలో విమర్శించారు. చంద్రబాబు పాలనను ప్రజా వ్యతిరేక విధానాలుగా అభివర్ణిస్తూ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వైద్యాన్ని పేదల దరిదాపుల నుంచి దూరం చేయాలనే ప్రయత్నానికి ప్రజలే అడ్డుగోడగా నిలవాలన్నారు. జగన్ మోహన్ రెడ్డి సంకల్పించిన ప్రజావైద్య విధానాన్ని కాపాడడం ప్రతి కార్యకర్త బాధ్యత" అని పిలుపునిచ్చారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, అవి పేదల ఆరోగ్య భద్రతకు ప్రతీకలుగా నిలుస్తాయని మాజీ ఎమ్మెల్యే గంగుల అన్నారు. ఆ నిర్మాణాలను అడ్డగించే ప్రయత్నం చేస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రతి గ్రామంలో కోటి సంతకాల సేకరణను బలోపేతం చేసి, ఆ తర్వాత గవర్నర్‌కు సంతకాల ప్రతులు అందజేసి ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించాలని సూచించారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఇది ప్రజా ఉద్యమం కావాలన్నారు. పౌరసమాజం, మేధావులు, ప్రజాసంఘాలు అందరూ గమనించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెద్ది రమణయ్య మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పి నరహరి పలువురు వైసిపి ప్రముఖులు ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలు పాల్గొన్నారు.



## అధిక వర్షాల వల్ల పంటలు నష్టపోయిన

# రైతులందరికీ నష్టపరిహారం చెల్లించాలి.

**ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా అక్టోబర్ 30:**
అధిక వర్షాల వల్ల పంట నష్టపోయిన ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రతినిధి బృందం పర్యటించి నష్టపోయిన పంటల వివరాలు రైతులతో తెలుసుకోవడం జరిగింది. నంద్యాల, పాణ్యం, గోస్పాడు మండలాల్లో కానాల, తొగర్చేడు, పుసలూరు, మిట్నాల, తేలపురి, పసులపాడు, గోస్పాడు గ్రామాల్లో పర్యటించిన నాయకులతో రైతులు మాట్లాడుతూ వేల రూపాయలు పెట్టుబడిగా పెట్టిన తర్వాత పంట చేతికి వచ్చే దశలో తుఫాన్ అపార నష్టాన్ని మిగిలించిందని, పెట్టుబడి కోసం చేసిన అప్పులు ఎలా చెల్లించాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని రైతులు తమ ఆవేదనను వెళ్లగక్కారు. పాలకులు తమను ఆదుకుంటారని గంపెడు ఆశలతో ఎదురుచూస్తున్నామని అన్నారు. ఒక ఎకరాకు 35 వేల నుండి 40 వేల వరకు పెట్టుబడి పెట్టామని, 18 బస్తాల వరి ధాన్యం కౌలుకు తీసుకున్నామని, తీరా పంట చేతికి వచ్చే దశలో అధిక వర్షం వల్ల పంట అంతా నేలపాలై మోకాళ్ళ లోతుపొలాల్లోనీళ్లు పారుతున్నాయని కానాల గ్రామానికి చెందిన కౌలు రైతులు మాలి భాష, జి నారాయణస్వామి గారు తమ ఆవేదనను వెళ్లగక్కారు. పొలాల్లో మొక్కజొన్న పంట నేల పాలెం కావడమే కాకుండా పోసిన తర్వాత కల్లా లలో కూడా తడిసిపోయి, రంగు మారి, మొలకెత్తి మొక్కజొన్న పంట నష్టపోయామని, మిరప పంటలో నీళ్లు అధికమై చనిపోతున్నాయని, ఈ మధ్యనే విత్తనంవేసిన పప్పు శనగ, జొన్న పంటలు మొలక దశలోనే నీళ్లు నిలబడి చనిపోవడం వల్ల తీవ్రంగా నష్టపోయామని వాపోయారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి.రామ చంద్రుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం .నరసింహ నాయక్, రైతు సంఘం జిల్లా నాయకులు శ్రీనివాసరెడ్డి, మహేశ్వర్ రెడ్డి, సిపిఎం నాయకులు చెన్నయ్య, కరిముల్లా మాట్లాడుతూ.. జిల్లాలో వరుసగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల ఖరీఫ్ సీజన్లో వేసిన మొక్కజొన్న ,వరి, మిరప, పత్తి పంటలు పూర్తిగా చేతికి వచ్చే దశలో నష్టపోవడం వల్ల రైతులందరికీ తీవ్రమైన నష్టం వాటిల్లింది. కావున రాష్ట్ర ప్రభుత్వం తక్షణం అన్ని గ్రామాల్లో పంటలు వేసి నష్టపోయిన రైతులందరికీ ఎకరాకు నలభై వేల రూపాయలు నష్టపరిహారంగా చెల్లించాలని, అలాగే పంటల బీమా వర్తింప చేయాలని, కౌలు రైతులందరికీ కూడా నష్టపరిహారం మరియు బీమా వర్తింపజేసి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. అలాగే వర్షానికి తడిసి, మొలకెత్తి నష్టపోయిన మొక్కజొన్నలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. అంతంత మాత్రం ఉన్న పంటల ఉత్పత్తులను తక్షణమే కొనుగోలు చేయడానికి అన్ని మండల కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధరలు అమలు చేసి, రైతుల వద్ద ఉన్న మొత్తం పంటలను అన్నింటిని ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతాంగానికి న్యాయం చేయాలని వారు కోరారు. అలాగే తెల్లపురి వద్ద




గత మూడు రోజుల నుండి కుందూ నది బ్రిడ్జి పైన నీళు పారుతుండడంతో రాకపోకలుఆగిపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నారనీ, కుందూ నది కి ఇరువైపులా ఉన్న గ్రామాల్లో పంట పొలాలన్నీ తీవ్రంగా నష్టపోయారని, రాబోయే రోజుల్లో నైనా కుందూ పరివాహ ప్రాంతా రైతులకు శాశ్వత పరిష్కారం చేసే ందుకు కృషి చేయాలని, తెల్లపురి వద్ద కొత్త బ్రిడ్జి నిర్మించాలని కోరారు.



# దేశాన్ని ఏకం చేసిన దక్షత

అమరావతి, **అక్టోబర్-30 ఆంధ్ర ప్రగతి**
ఉక్కు మనిషిగా పేరుగాంచిన గొప్ప దేశభక్తుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, రాజనీతిజ్ఞుడు సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్. దేశ సమైక్యత, సమగ్రత పట్ల ఆయన దూరదృష్టి, సాహసం, స్వాతంత్ర్యం సిద్ధించిన తొలినాళ్లలో పలు విపత్కర సమస్యలను ఎదుర్కొని దేశాన్ని ముందుకు నడిపించిన విధానాన్ని ప్రజలందరూ ఇప్పటికీ గుర్తుచేసుకుంటున్నారు. గుజరాత్‌లోని నాడియాడ్‌లో 1875 అక్టోబర్ 31న జన్మించిన వల్లభ్‌భాయ్, బారిష్టరు చదువు పూర్తి చేసుకొని అహ్మదాబాద్‌లో లాయరుగా పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. మహాత్మాగాంధీ పిలుపు మేరకు స్వాతంత్ర్య ఉద్యమంలో అడుగుపెట్టి, గాంధీతో పాటు ఎన్నో పోరాటాల్లో భాగస్వాములయ్యారు. లాయర్‌గా తన ప్రాక్టీస్‌ను వదిలిపెట్టి ఉద్యమాలు సాగించారు. పాశ్చాత్య వస్త్రధారణ వదిలేసి, నిరాడంబరత అలవర్చుకుని, స్వదేశీ భావనకు అలవాటుపడ్డారు. మహాత్మాగాంధీ ఆలోచనలను, భావాలను సరైన దృష్టికోణం నుంచి అర్థం చేసుకున్న రాజకీయ నాయకులలో సర్దార్ పటేల్ ఒకరు. గాంధీజీ 'స్వరాజ్యం నుంచి సురాజ్యం' గురించి చెబితే, పటేల్ స్వరాజ్యాన్ని సురాజ్యంగా మార్చు చేసే సుపరిపాలనకు, సంస్కరణలకు దారితీసిన ఆద్యుడు. గుజరాత్‌లోని ఖేదా, బార్డోలీ ప్రాంతాల్లో గాంధీ ప్రేరణతో పటేల్ నడిపిన సత్యాగ్రహం, అపూర్వమైన రైతాంగ ఉద్యమం ఆయనకు చరిత్రలో చిరస్థానాన్ని కల్పించాయి. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి, విభజన గాయాలు చెలరేగుతున్న అస్థిర కాలంలో మొదటి హోం శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పటేల్ మొదట సంస్థానాలను విలీనం చేసి దేశాన్ని ఏకం చేయటంలో ప్రముఖ పాత్ర పోషించారు. తన దౌత్య చాతుర్యంతో, ధైర్యంతో, స్పష్టమైన నిర్ణయాలతో అనేక సమస్యలను పరిష్కరించారు. బ్రిటిష్ పాలకులు దేశానికి స్వాతంత్ర్యం ఇచ్చినప్పటికీ సంస్థానాల విషయంలో మెలిక పెట్టి వెళ్లడం సమస్యగా మారింది. అప్పటికి దేశంలో ఉన్న 565 సంస్థానాలకు స్వయం నిర్ణయాధికారాన్ని కట్టబెట్టారు ఆంగ్లేయులు. అందులో 562 సంస్థానాలను సామ దాన భేద దండోపాయాలతో పటేల్ భారత్‌లో చేర్చగా... కశ్మీర్, జునాగఢ్, హైదరాబాద్ సంస్థానాలు మాత్రం స్వతంత్ర రాజ్యాలుగా ఉంటామని భీష్మించాయి. గుజరాత్‌లోని జాంనగర్ పూర్వ రాజైన జాంసాహిబ్‌కు చెందినది. అధికార బదిలీకి ఇంకా రెండు నెలల గడువు ఉండగా ఈలోపే జాంసాహిబ్ కతియావర్ ప్రాంత రాష్ట్రాలన్నిటినీ కలిపి పాకిస్థాన్ సహాయంతో ఒక స్వతంత్ర రాజ్యంగా ఏర్పాటు చేయాలనుకున్నాడు. ఈ ఉద్దేశ్యంతో ఢిల్లీలోని తోటి సంస్థానాధీశులను కలవబోతున్నాడని పటేల్‌కు తెలిసింది. ఆ వెంటనే జాంసాహిబ్ సోదరుడైన కల్నల్ హిమ్మత్‌సింగ్ ద్వారా వారిని తన ఇంటికి విందుకు తీసుకురావాలని పటేల్ కోరాడు. భోజన సందర్భంలో పటేల్ తన ఆత్మీయతతో, ప్రేమతో జాంసాహిబ్ హృదయాన్ని గెలుచుకున్నారు. జాంసాహిబ్ స్వతంత్ర రాజ్యం ఏర్పాటు చేయాలన్న ప్రణాళికను విరమించుకున్నాడు. మరో సంఘటన షేక్ అబ్దుల్లాకు సంబంధించినది. కశ్మీర్‌ను పాలిస్తున్న రాజా హరిసింగ్ భారత యూనియన్‌లో కలవాలనుకోగా, కశ్మీర్‌లో 'నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ' నాయకుడు షేక్ అబ్దుల్లా మాత్రం కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి ఆశించి, దానికై ఎడతెగని ప్రయత్నాలు ఆరంభించాడు. దేశానికి మకుటమైన కశ్మీర్ – రక్షణ దృష్ట్యా, సంస్కృతి దృష్ట్యా, ప్రకృతి సౌందర్యం దృష్ట్యా ఎంతో కీలకమైన ప్రదేశం. రాజ్యాంగ పరిషత్‌లో కశ్మీర్‌కు సంబంధించిన 'ఆర్టికల్ 370'పై చర్చిస్తున్న సమయంలో అసహనంతో ఉన్న షేక్ అబ్దుల్లా తన స్థానం నుంచి లేచి "నేను తిరిగి కశ్మీర్‌కు వెళుతున్నాను" అని సభలో ప్రకటించాడు. దీంతో ప్రధాని నెహ్రూ లేని కారణంగా రాజ్యాంగ పరిషత్‌లో ఉన్న పటేల్, "ఈ రోజు సభ నుంచి వెళ్లి రైలులో కూర్చోవచ్చు. కానీ ఆ రైలు మాత్రం ఢిల్లీని దాటి వెళ్లబోదు" అనే సందేశాన్ని తెలియజేశారు. పరిణామాలను గ్రహించిన షేక్ అబ్దుల్లా తన ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు. హైదరాబాద్ సంస్థానం ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ పాలనలో ఉంది. సొంత కరెన్సీ, సొంత రైల్వే, సొంత సైన్యం ఉన్న హైదరాబాద్‌ను స్వతంత్ర రాజ్యంగా ఉంచాలని నిజాం ప్రయత్నించారు. భారత్‌లో విలీనానికి గడువు కావాలని, అప్పటివరకు స్వతంత్రంగా



ఉంటామని ప్రతిపాదించారు. అందుకు పటేల్ అంగీకరించలేదు. ఎందుకంటే, భారత్‌తో గడువు కోరిన నిజాం, మరోవైపు పాకిస్థాన్‌కు రూ.20 కోట్లు ఇచ్చినట్లుగా ఆధారాలు దొరికాయి. అంతేగాక, హైదరాబాద్ సంస్థానం తరపున కరాచీలో ప్రజా సంబంధాల అధికారిని కూడా నిజాం నియమించారు. దీంతో నిజాం వైఖరిపై పటేల్‌కు సందేహం కలిగింది. పటేల్ ఆదేశాలతో మేజర్ జనరల్ జె.ఎన్.చౌధురి నేతృత్వంలో 'ఆపరేషన్ పోలో' 1948 సెప్టెంబర్ 13న మొదలై అదే నెల 18 సాయంత్రానికి పూర్తయింది. సైనిక చర్య ద్వారా హైదరాబాద్ సంస్థానాన్ని రెండు వైపుల నుంచి ముట్టడించి పటేల్ స్వాధీనం చేసుకున్నారు. సెప్టెంబర్ 17న భారత్ యూనియన్‌లో విలీనం చేసి హైదరాబాద్ రాష్ట్రంలో మువ్వన్నెల భారత పతకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా పటేల్‌ను ఉద్దేశించి రష్యా ప్రధాని నికోలయి బుల్గనిన్ "మీరు రాజులను అంతం చేయకుండానే, రాజుల పాలనను అంతం చేశారు" అంటూ చేసిన వ్యాఖ్యలు పటేల్ పరిపాలనా దక్షతకు అద్దం పడుతుంది. పటేల్ ఒక వైపు సంస్థానాల విలీనంతో పాటు మరోవైపు భారత పరిపాలన వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు కూడా కృషి చేశారు. స్వాతంత్ర్యానంతరం పాలనలో సారూప్యతను, దేశ సమైక్యతను సాధించాలనే సంకల్పంతో అఖిల భారత సర్వీసులను (ఐఏఎస్, ఐపీఎస్) ఏర్పాటు చేశారు. అందుకే ఆయనను అఖిల భారత సివిల్ సర్వీసుల పితామహుడుగా అభివర్ణిస్తారు. పోలీస్ వ్యవస్థను బలోపేతం చేయడంలో పటేల్ కృషి మరువలేనిది. మొదటి సాంస్కృతికశాఖా మంత్రిగా కూడా బాధ్యతలు అందించిన పటేల్ గుజరాత్‌లోని సోమనాథ్ దేవాలయ పునర్నిర్మాణానికి పూనుకున్నారు. అంతర్గత భద్రత వ్యవస్థ, సరిహద్దు పరిరక్షణ, రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ మొదలైన అంశాలపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. నేడు దేశ సమగ్రత, సమైక్యత అత్యంత ప్రధానమైన అంశం. భాష పేరుతో, మతం పేరుతో, కులం పేరుతో రెచ్చగొట్టి దేశాన్ని ముక్కలు ముక్కలు చెయ్యాలని చూస్తున్న విదేశీ స్వార్థ శక్తులకు స్వదేశంలో కూడా వంత పాడేవాళ్లు తోడయ్యారు. దేశంలోను 'దక్షిణమూ ఉత్తరమూ వేర్వేరు' అనే భావనను రేకెత్తించేందుకు కొందరు పన్నుతున్న కుయుక్తులను అణచివేసి మనమందరం '145 కోట్ల భారతీయులం' అన్న భావన తీసుకురావడమే ప్రధాన లక్ష్యం. ఆనాడు పటేల్ ఈ దృఢ సంకల్పంతోనే రజాకార్లను, ప్రత్యేకవాదులను అణచివేశాడు. నేడు పటేల్ స్ఫూర్తితో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారత ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదులకు గట్టి గుణపాఠం నేర్పింది. జాతి సమైక్య సారథిగా, నవభారత వారధిగా మన దేశ చరిత్రలో పటేల్ స్థానం సుస్థిరం. పటేల్ అంత్యక్రియలకు హాజరైన నాటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ "సర్దార్ శరీరాన్ని ఈ అగ్ని దహించివేయొచ్చు. కానీ, ఆయన కీర్తిని దహించే అగ్ని ఈ ప్రపంచంలో లేదు" అన్నారు. కాలాలు మారినా ఇనుమడిస్తున్న ఆయన కీర్తే అందుకు ఋజువు.

# ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ.

## -ఆళ్లగడ్డ వైసిపి నాయకులు మందాల శివారెడ్డి.

**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల అక్టోబర్ 30:**
మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్ఆర్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆదేశాల మేరకు శిరివెళ్ల మండలం వీరారెడ్డి పల్లి గ్రామపంచాయతీలో కోటి సంతకాల కార్యక్రమాన్ని నిర్వహించినట్లు గ్రామపంచాయతీ సర్పంచ్ మందాల రాధిక శివారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చురుగ్గా కొనసాగుతున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా వీరారెడ్డిపల్లి గ్రామంలోని పలువురు వైయస్ఆర్‌సీపీ శ్రేణులు ఇంటింటా పర్యటించి కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో ప్రైవేటీకరణ చేస్తే కలిగే నష్టాల గురించి



ప్రజలకు వివరించినట్లు మందాల శివారెడ్డి తెలిపారు. ఈ ఉద్యమానికి మెడికల్ మరియు ఐటీ విద్యార్థులు ఉద్యోగుల రైతులు సామాన్య ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. వీరారెడ్డి పల్లె గ్రామంలో గురువారం ఉదయం నిర్వహించిన కోటి సంతకాల కార్యక్రమంలో పాల్గొని సంతకాలు చేసిన అనంతరం కూటమి ప్రభుత్వం తీసుకున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ సందర్భంగా మందాల శివారెడ్డి మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ నుంచి నవంబర్ 22వ తేదీ వరకూ కోటి సంతకాల సేకరణ చేపట్టాలని పార్టీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పిలుపు మేరకువిద్యార్థులు ఉద్యోగులు నిరుద్యోగుల నుండే కాకుండా ప్రజల నుంచి సైతం సంతకాలు సేకరించినట్లు మందాల తెలియజేశారు. ఈ సంతకాల సేకరణకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి ఈ శిబిరంలో సంతకాలు చేస్తున్నారని మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ విషయంలో చంద్రబాబు ప్రభుత్వం పునరాలోచన చేసి ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని మందాల శివారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు ప్రముఖులు రైతులు నిరుద్యోగులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ హెన్రీ డ్యూనాంట్ సేవలు చిరస్మరణీయం.

## సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి.

**ఆంధ్ర ప్రగతి డోన్ అక్టోబర్ 30:**
డోన్ పట్టణంలో సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి ఆద్వర్యంలో అక్టోబర్ 30 ప్రపంచ రెడ్‌క్రాస్ సంస్థ వ్యవస్థాపకులు శ్రీ హెన్రీ డ్యూనాంట్ వర్ధంతి సందర్భంగా మరియు మొదటి సల్ఫా ఔషధాన్ని కనుగొన్న శాస్త్రవేత్త శ్రీ గెర్ హర్డ్ డొమాక్ జయంతి సందర్భంగా వారి చిత్ర పటాలకు పూలమాల వేసి ఘణంగా నివాళి అర్పించారు. వారిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి మాట్లాడుతూ..మన దేశ



స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫికోరారు1) డొమాగ్క్ అక్టోబర్ 30, 1895న జన్మించారు. ఈయన బాక్టీరియాలజిస్ట్ మరియు పాథాలజిస్ట్ సల్ఫోనామైడ్స్ యాంటీ బాక్టీరియను ఆవిష్కరించారు. మొదటి సల్ఫా ఔషధాన్ని కనుగొన్నందున కోట్ల మంది ప్రజల ప్రాణాలు కాపాడారు. డాక్టర్ డొమాగ్క్ ఏప్రిల్ 24, 1964 న స్వర్గస్తులైనారు. ఇలాంటి మహానుభావులను ఎల్లవేళల స్మరించుకుంటు వారి అడుగుజాడలలో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి కోరారు2)జీన్–హెన్రీ డునాంట్ 8 మే 1828 జన్మించారు. మానవతావాది, వ్యాపారవేత్త మరియు సామాజిక వేత్త. అతను రెడ్ క్రాస్ యొక్క వ్యవస్థాపకులు అతనుమొదటి నోబెల్ శాంతి బహుమతిని అందుకున్నాడు. ప్రపంచ వ్యాప్తంగా అనేక విపత్తుల ద్వారా బాధపడుతున్న పేద ప్రజలకు సహాయం చేయడానికి అన్ని ప్రభుత్వాలు మరియు స్వచ్ఛంద సంస్థలు క్రియాశీల సభ్యులుగా మారి సహాయం చేస్తున్నాయి. అంతర్జాతీయ రెడ్ క్రాస్ సంస్థ ప్రపంచంలోనే అతిపెద్ద మానవతా సంస్థగా ఖ్యాతిని గడించింది. హెన్రీ డునాంట్ 30 అక్టోబర్ 1910 స్వర్గస్తులైనారు. ఇలాంటి మహానుభావులను ఎల్లవేళల స్మరించుకుంటు వారి అడుగుజాడలలో ,సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి కోరారు.

# మొంథా తుఫాను తాకిడికి నష్టపోయిన రైతునీ ఆదుకోవాలి.

## సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రైతు సంఘం.







**ఆంధ్ర ప్రగతి మహానంది. అక్టోబర్ 30:**
మహానంది మండలం మొదలుకొని అన్ని మండలాలలో బండి ఆత్మకూరు మండలాల లో అధిక వర్షాల వల్ల నష్టపోయిన వరి. మొక్కజొన్న అరటిపంట పసుపు రైతులను ఆదుకోవాలి. నంద్యాల డివిజన్ పరిధిలోని బండి ఆత్మకూరు,మహానంది, మండలాలలో గత మూడు రోజుల గా అధిక వర్షాలవల్ల వరదల వల్ల నష్టపోయిన అరటి,పసుపు,మొక్కజొన్న,వరి,రైతులను జిల్లా కలెక్టరు రెవెన్యూ అధికారులు పరిశీలించి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. సోమన్న సిపిఐ మహానంది మండల కార్యదర్శి ఆర్ సామేలు రైతు సంఘం మండల కార్యదర్శి. గురుమూర్తి మహానంది బండ ఆత్మకూరు మండలాల గ్రామాలలో పంట పొలాలను వరద ప్రాంతాలను సందర్శించి పరిశీలించి డిమాండ్ చేయడం జరిగింది.

ఈ సందర్భంగా సిపిఐ, రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. నంద్యాల డివిజన్ పరిధిలోని పలు మండలాలలో గత మూడు రోజులుగా మొంథా తుఫాన్ వల్ల జనజీవనం అస్తవస్తమై కాలువలు పొంగి పొర్లి జలమైన లోతట్టు ప్రాంతాలు చేతికొచ్చే సమయంలో వరి మొక్కజొన్న వరి రైతులు ,అరటి తోటల్లో నిలిచిన వర్షపు నీరు అధిక గ్రామాలలో వరదనీరు వల్ల గ్రామాల ప్రజలు రైతులు తీవంగా నష్టపోయి ఇబ్బందులు కు గురికావడం బాధాకరమని అన్నారు.

డివిజన్ పరిధిలో పలు మండలాలు ఒకవైపు రైతులు ప్రజలు ఇబ్బందులు పడుతుంటే అధికారులు కార్యాలయాల్లో కాలాయాపన చేయడం దుర్మార్గమైనదని కేవలము జిల్లా కలెక్టర్. జిల్లా పోలీసు అధికారులు సంబంధించిన అధికారులు మాత్రమే చొరవ చూపారని మిగతా అధికారులు మాత్రం కార్యాలయలకే పరిమితమయ్యారని వెంటనే జిల్లా కలెక్టర్ జిల్లా రెవెన్యూ అధికారులు నంద్యాల డివిజన్ పరిధిలో మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన గ్రామాలను ప్రజలను రైతులను ఆదుకోవాలని సిపిఐ ,రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

# తోడుతున్న తరగని ఊట

## విద్యుత్ మోటార్ల ద్వార వరద నీరు పంపింగ్.

**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల అక్టోబర్ 30 :**
మండల కేంద్రంలోని పలు కాలనీలలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యి తగ్గులో ఉన్న నివాసాల సమీపంలో వరద నీరు విలిచి ఉండడం పట్ల సంబంధిత ప్రజలు సమస్య నివారణ కోసం తెలియజేయగా శిరివెళ్ల మేజర్ పంచాయతీ ఈవో అశ్విని కుమార్ వెంటనే స్పందించారు. వరద నీటిని పల్లపు తగ్గు ప్రాంతాల నుండి



తరలించేందుకు విద్యుత్ మోటార్ల సహాయంతో నివారణ చర్యలు చేపట్టారు. ఖర్జూరపేట దేగల పేట తగ్గు బజార్ ఒకటవ వార్డు తదితర కాలనీలలో వరద నీరు నిలిచి ప్రజలకు అసౌకర్యంగా తలెత్తడంతో విద్యుత్ మోటార్ ద్వారా ఉదయం 9 గంటల నుండి వరద నీటిని పంపింగ్ చేస్తున్నట్లు గ్రామపంచాయతీ అధికారులు తెలిపారు. నివాస ప్రాంతాలు పరిసరాలలో వర్షపు నీరు గాని వరద నీరు గాని నిలిచి ఉంటే సంబంధిత ప్రజలు నీరు నిలవకుండా తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. నీరు నిలిస్తే మురికి నీరుగా మారి దోమలు వృద్ధి చెంది దుర్వాసన వెదజల్లుతాయని ఉన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛందంగా పరిసరాల పరిశుభ్రతకు వ్యక్తిగత శుభ్రతకు నాంది పలుకుతూ నీటీ నిలువ ప్రాంతాలు లేకుండా జాగ్రత్త వహించాలని ఈవో అశ్విని కుమార్ పిలుపునిచ్చారు. ఉదయం తొమ్మిది నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఒక నివాసం వద్ద విద్యుత్ మోటార్ ద్వారా వరద నీటిని పంపింగ్ చేస్తుండగా ఏ మాత్రం నీరు తగ్గలేదని మధ్యాహ్నం తర్వాత తీరా పరిశీలిస్తే ఆ ఇంట్లో మరియు పరిసరాలలో నీటి ఊట ఉత్పత్తి అవుతున్నదని ఒకవైపు పంపింగ్ చేస్తుండగా మరోవైపు నీటి ఊట కొనసాగుతున్నదని ఈవో అశ్విని కుమార్ తెలియజేశారు. ఈ సందర్భంగా అతి తక్కువ నేలకు సమాంతరంగా ఉన్న నివాస ప్రాంతాలలో గాని పరిసరాలలో గాని మట్టి తోలుకొని ఇతరుల నివాసాలకు సమాంతరంగా చదును చేసుకుంటే వర్షాకాలంలో నీరు నిలవకుండా ఉంటుందని సూచించారు. శిరివెళ్ల మేజర్ గ్రామపంచాయతిలో పరిసరాల పరిశుభ్రతకు దోమల నిర్మూలనకు శానిటేషన్ వర్కర్ల ద్వారా అవసరమైతే జెసిబి యంత్రాల ద్వారా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఇఓ అశ్విన్ కుమార్ తెలిపారు.

# తుపాన్ సాయంపై రాజకీయ దుమారం..

## అప్పటికి ఇప్పటికి తేడా ఇదేనంటూ వైసీపీ ఎమ్మెల్యే ట్వీట్

**అక్టోబర్-30 ఆంధ్ర ప్రగతి**
మొంథా తుపాన్ ఏపీని అతలాకుతలం చేస్తున్న వేళ, ప్రభుత్వం ప్రకటించిన సహాయక చర్యలపై రాజకీయ విమర్శలు మొదలయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వంతో పోలిస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అందిస్తున్న సాయం చాలా తక్కువగా ఉందంటూ ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం వైసీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా రెండు ప్రభుత్వాల హయాంలో అందించిన సాయాన్ని పోలుస్తూ ఓ పోస్ట్ పెట్టారు. "వరదల సమయంలో వైఎస్ జగన్ సీఎంగా ఉంటే రూ.2,000%-%రూ.3,000 నగదుతో పాటు రేషన్ కిట్, ఇంటి నష్టం: రఊ. 10,000%-% రూ.1,20,000, పంట నష్టం: రూ.5,000%-%రూ.10,000(ఎకరానికి), మనిషి చనిపోతే రూ. 5,00,000 సహాయం ఇంటి తలుపువద్దకే వచ్చేది. కానీ, ఇప్పుడు చంద్రబాబు ఉన్నందున ఒక్కరికి రూ.1,000, కుటుంబానికి రూ.3,000 ఇస్తున్నారని" ఆయన తన ట్వీట్‌లో పేర్కొన్నారు. అయితే, కూటమి ప్రభుత్వం ప్రకటించిన వివరాల ప్రకారం.. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లోని పునరావాస కేంద్రాలకు తరలించిన కుటుంబాలకు రూ.3,000 చొప్పున ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. కుటుంబంలో ఒక్కరే ఉంటే రూ.1,000 ఇవ్వాలని ఆదేశించారు. బాధితులు తమ ఇళ్లకు తిరిగి వెళ్లే సమయంలో ఈ మొత్తాన్ని అందజేయాలని కలెక్టర్లకు సూచించారు. దీంతో పాటు నిత్యావసర సరుకుల పంపిణీకి కూడా భారీ ఏర్పాట్లు చేశారు.

# జెమీమా శతకమోత

## విజృంభించిన హర్మన్





నవీ ముంబై: వన్డే వరల్డ్ కప్ చరిత్రలోనే అత్యధిక లక్ష్యాన్ని ఛేదించిన భారత మహిళల జట్టు మూడోసారి ఫైనల్లోకి అడుగుపెట్టింది. జెమీమా రోడ్రిగ్స్ (134 బంతుల్లో 14 ఫోర్లతో 127 నాటౌట్), హర్మన్‌ప్రీత్ కౌర్ (88 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లతో 89) అదరగొట్టడంతో.. గురువారం ఉత్కంఠభరితంగా సాగిన రెండో సెమీసలో డిఫెండింగ్ చాంప్ ఆస్ట్రేలియాను భారత్ 5 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. తొలుత ఆస్ట్రేలియా 49.5 ఓవర్లలో 338 పరుగులకు ఆలౌటైంది. ఫోబీ లిచ్‌ఫీల్డ్ (119), ఎలీస్ పెర్రీ (77), ఆష్లే గార్డ్‌నర్ (63) శ్రమ వృథా అయింది. శ్రీచరణి, దీప్తి చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో భారత్ 48.3 ఓవర్లలో 341/5 స్కోరు చేసి గెలిచింది. రిచా ఘోష్ (26) దూకుడుగా ఆడింది. కిమ్ గార్త్, సదర్లాండ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఓపెనర్‌గా షఫాలీని ఎంపిక చేయ గా.. హర్లీన్ డియోల్ స్థానంలో అమన్‌జోత్ కౌర్ టీమ్‌లోకి వచ్చింది. జెమీమా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది. కాగా భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ ఆదివారం జరుగ %ఆందోళనకు గురైనా.. : భారీ ఛేదనలో జెమీమా జట్టును ముందుండి నడిపించింది. కెప్టెన్ హర్మన్‌తో కలిసి మూడో వికెట్‌కు 167 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన రోడ్రి గ్స్.. దీప్తి శర్మ (24), రిచా, అమన్‌జోత్ కౌర్ (15 నాటౌట్)తో కలిసి జట్టును విజయ తీరాలకు చేర్చింది. ఓపెనర్ షఫాలీ వర్మ (10) స్వల్ప స్కోరుకే వెనుదిరిగిం ది. అయితే, మరో ఓపెనర్ స్మృతి మంధాన (24), వన్‌డౌన్ బ్యాటర్ జెమీమా రెండో వికెట్‌కు 46 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. కానీ, లెగ్‌సైడ్‌లో వెళ్తున్న బంతిని కదిలించి మరీ మంధాన అవుట్ కావడంతో భారత్ 59/2తో నిలిచింది. అయితే, రోడ్రిగ్స్‌కు కెప్టెన్ హర్మన్ జత కావడంతో స్కోరు ఊపందుకొంది. స్ట్రయిక్ రొటేట్ చేస్తూనే వీలుచిక్కినప్పుడల్లా షాట్లు ఆడుతూ రన్‌రేట్‌ను నియంత్రణలో ఉంచారు. ఈ క్రమంలో జెమీమా అర్ధ శతకం పూర్తి చేసుకోగా.. ఆ తర్వాత కౌర్ జోరందుకొంది. 29వ ఓవర్‌లో సింగిల్‌తో ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న హర్మన్ ఆ తర్వాత రెండు భారీ సిక్స్‌లతో దూకుడు పెంచింది. దీంతో 32వ ఓవర్‌లో టీమ్ స్కోరు 200 మార్క్ దాటింది. ఈ క్రమంలో వరుస బౌండ్రీలతో విరుచుకుపడుతున్న కౌర్‌ను సదర్లాండ్ అవుట్ చేసింది. ఈ దశలో దీప్తితో కలసి జెమీమా జట్టును గెలిపించే బాధ్యత భుజాన వేసుకొంది. కానీ, చివరి 10 ఓవర్లలో 82 పరుగులు కావల్సి ఉండగా.. దీప్తి రనౌట్ అయింది. అనంతరం క్రీజులోకి వచ్చిన రిచా అటాకింగ్ ఆటతో ఆసీస్ బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించే ప్రయత్నం చేసింది. మరోవైపు బౌండ్రీతో సెంచరీ పూర్తి చేసుకొన్న రోడ్రిగ్స్.. సదర్లాండ్ బౌలింగ్‌లో మెక్‌గ్రాత్ క్యాచ్ చేజార్చడంతో బతికిపోయింది. 45వ ఓవర్‌లో గార్డ్‌నర్ బౌలింగ్‌లో రిచా 6,4తో జోరు చూపడంతో.. సమీకరణం 34 బంతుల్లో 30 పరుగులకు దిగివచ్చింది. కీలక సమయంలో రిచాను అవుట్ చేసిన సదర్లాండ్ ఉత్కంఠ రేపింది. కానీ, అమన్‌జోత్, జెమీమా చెరో రెండు బౌండ్రీలతో మోతెక్కించడంతో.. భారత్ 9 బంతులు మిగిలుండగానే విజయాన్ని అందుకొంది. : ఓపెనర్ లిచ్‌ఫీల్డ్, పెర్రీ రెండో వికెట్‌కు 155 పరుగుల దూకుడైన భాగస్వామ్యంతో ఆసీస్ భారీ స్కోరు చేసింది. ఒకదశలో స్కోరు 400 మార్క్ దాటేలా కనిపించింది. కానీ, చివరి 16.1 ఓవర్లలో 118 పరుగులకు 8 వికెట్లు పడగొట్టిన భారత బౌలర్లు ఆసీస్ జోరుకు కొంతమేర బ్రేకులు వేశారు. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ స్వల్ప స్కోరుకే కెప్టెన్ హీలీ (5) వికెట్ కోల్పోయింది. కానీ, ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. లిచ్‌ఫీల్డ్, పెర్రీ క్రీజులో నిలదొక్కుకోవడంతో పరుగుల వరద పారింది. ముఖ్యంగా లిచ్‌ఫీల్డ్ గతితప్పిన భారత బౌలింగ్‌ను ఉతికి ఆరేసింది. ఫీల్డింగ్ కూడా పేలవంగా ఉండడంతో ఫోబి స్వేచ్ఛగా బ్యాటింగ్ చేసింది. ఆమెను నియంత్రించడానికి హర్మన్‌ప్రీత్ బౌలర్లను మార్చి ప్రయోగించిన ఫలితం దక్కలేదు. ఈ క్రమంలో శతకం పూర్తి చేసుకొన్న లిచ్‌ఫీల్డ్‌ను అమన్‌జోత్ బౌల్డ్ చేసి జట్టుకు ఊరటనిచ్చింది. ఆ తర్వాత బెత్ మూనీ (24), సదర్లాండ్ (3)ను చరణి అవుట్ చేయడంతో స్కోరు వేగం మందగించింది. ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న పెర్రీని రాధ బౌల్డ్ చేసింది. కానీ, డెత్ ఓవర్లలో గార్డ్‌నర్ ఎడాపెడా షాట్లతో చెలరేగడంతో ఆసీస్ 330కి పైగా స్కోరు సాధించింది.

## నేను ప్రస్తుతం కోలుకునే దశలో ఉన్నాను

● భారత వన్డే వైస్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్



సిడ్నీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భారత వన్డే వైస్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ ఆరోగ్యంపై తాజా సమాచారం ఇచ్చారు. గత కొన్ని రోజులుగా ఆసుపత్రిలో ఉన్న అయ్యర్ ప్రస్తుతం కోలుకుంటున్నట్లు తెలిపారు. దీని గురించి శ్రేయాస్ అయ్యర్ సోషల్ మీడియా పోస్ట్‌ను షేర్ చేస్తూ, "నేను ప్రస్తుతం కోలుకునే దశలో ఉన్నాను. రోజురోజుకూ మెరుగుపడుతు న్నాను. మీ నుంచి నాకు లభించిన మద్దతుకు నేను చాలా కృతజ్ఞుడను. నన్ను మీ ఆలోచనల్లో ఉంచుకున్నందుకు ధన్యవాదాలు" అంటూ శ్రేయాస్ ఇన్‌స్టాగ్రామ్‌లో రాసుకొచ్చాడు. దీంతో శ్రేయాస్ అయ్యర్ ఆరోగ్యంపై ఉన్న ఆందోళనలు తొలగిపోయాయి. ఆయన కోలుకుంటున్నందున, డిశ్చార్జ్ అయి మరో వారంలో భారతదేశానికి తిరిగి రావొచ్చు. ముంబైలో ఆయన చికిత్స కొనసాగించే అవకాశం కూడా ఉంది. ఆస్ట్రేలియాతో సిడ్నీలో జరిగిన మూడో వన్డేలో, హర్షిత్ రాణా వేసిన బంతిని అలెక్స్ కారీ అద్భుతమైన షాట్ కొట్టాడు. బ్యాక్‌వర్డ్ పాయింట్‌లో నిలబడి ఉన్న అయ్యర్ వేగంగా పరిగెత్తి డైవింగ్ క్యాచ్ తీసుకున్నాడు. ఈ డైవింగ్ సమయంలో, అతని ఎడమ పక్కటెముకలకు తీవ్ర గాయం అయింది. దీని వల్ల అతని ప్లీహము (ప్లీహము) పైన ఉన్న అవయవంలో అంతర్గత రక్తస్రావం జరిగింది. దీని కారణంగా, అతను అస్వస్థతకు గురయ్యాడు. స్కానింగ్ నివేదికలో శ్రేయాస్ అయ్యర్ ప్లీహములో కొంత భాగం చీలిపోయినట్లు తేలింది. అందువల్ల, అతను ఇంటర్వెన్షనల్ ట్రాన్స్-కాథెటర్ ఎంబోలైజేషన్ చికిత్స చేయించుకున్నాడు. ప్రస్తుతం ఆయన కోలుకున్నారని, ఐసీయూ నుంచి వార్డుకు మార్చారని సమాచారం. శ్రేయాస్ అయ్యర్ మరో వారం రోజుల్లో భారత్ కు తిరిగి వస్తారని సమాచారం. ప్రస్తుతం వైద్య పర్యవేక్షణలో ఉన్న శ్రేయాస్ అయ్యర్ పూర్తిగా కోలుకోవడానికి రెండు నెలలు పడుతుందని తెలిసింది. అందుకే, నవంబర్‌లో జరగనున్న దక్షిణాఫ్రికాతో జరిగే సిరీస్‌లో శ్రేయాస్ అయ్యర్ కనిపించడు. జనవరి నాటికి పూర్తి ఫిట్‌నెస్ సాధించినట్లయితే మాత్రమే అతను న్యూజిలాండ్‌తో జరిగే సిరీస్‌లో కూడా కనిపిస్తాడు.

## నల్ల బ్యాండ్స్‌తో భారత్, ఆసీస్ ఆటగాళ్లు..

మహిళల వన్డే ప్రపంచకప్ 2025లో భాగంగా భారత్, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న సెమీఫైనల్లో ఇరు జట్ల ఆటగాళు నల్ల బ్యాండ్స్ ధరించి బరిలోకి దిగారు. 17 ఏళ్ల ఆసీస్ యువ క్రికెటర్ బెన్ ఆస్టిన్ అకాల మృతికి సంతాపంగా ఇరు జట్ల ఆటగాళ్లు బ్లాక్ ఆర్మ్ బ్యాండ్స్ ధరించారు. మెల్‌బోర్న్‌లో ప్రాక్టీస్ నెట్ సెషన్‌లో బంతి మెడ భాగంలో బలంగా తగలడంతో ఆస్టిన్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఆస్ట్రేలియా దివంగత క్రికెటర్ ఫిలిప్ హ్యూస్ మరణ ఉదంతాన్ని గుర్తు చేసిన ఈ ఘటన యావత్ క్రికెట్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. 17 ఏళ్ల బెన్ ఆస్టిన్ మంగళవారం మధ్యాహ్నం ఫర్న్‌ట్రీ గల్లీలోని వ్యాలవీ ట్యూ రిజర్వ్‌లో శిక్షణ తీసుకుంటుండగా ఈ విషాదకర సంఘటన జరిగింది. క్రికెట్ ఆస్ట్రేలియా వివరాల ప్రకారం.. ఈ యువకుడు నెట్స్‌లో హెల్మెట్ ధరించి బౌలింగ్ మెషీన్ ముందు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తుండగా.. బంతి అతని మెడ భాగంలో బలంగా తాకింది. దాంతో ఆస్టిన్ క్రీజులోనే కుప్పకూలిపోగా.. అతన్ని హుటాహుటిన మోనాష్ మెడికల్ సెంటర్‌కు తరలించారు. తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ బుధవారం ఆస్టిన్ తుదిశ్వాస విడిచాడు. 2014లో ఫిలిప్ హ్యూజ్ కూడా ఆస్ట్రేలియా దేశవాళీ క్రికెట్ మ్యాచ్‌లో ఇలానే గాయపడి ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆసీస్ బ్యాటింగ్ ఎంచుకోగా.. టీమిండియా మూడు మార్పులతో బరిలోకి దిగింది. గత మ్యాచ్‌లో గాయపడి జట్టుకు దూరమైన ప్రతికా రావల్ స్థానంలో షెఫాలీ వర్మ తుది జట్టులోకి రాగా.. రిచా ఘోష్, క్రాంతి గౌడ్ రీఎంట్రీ ఇచ్చారు. హర్లీన్ డియోల్‌పై వేటు పడగా.. ఉమా ఉద్వాసనకు గురైంది.

## పెళ్లి పీటలు ఎక్కనున్న స్మృతి మంధాన



భారత మహిళా క్రికెట్ జట్టు వైస్-కెప్టెన్, స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన త్వరలో పెళ్లి పీటలు ఎక్కబోతున్న సంగతి తెలిసిందే. ఆమె తన ప్రియుడు, ప్రముఖ బాలీవుడ్ సంగీత దర్శకుడు పలాష్ ముచ్ఛల్ ను వివాహం చేసుకోబోతున్నారు. ఈ సందర్భంగా వారి పెళ్లి వేడుకలు స్మృతి మంధాన సొంత ప్రాంతం సాంగ్లీ లో మొదలుకానున్నాయంట. నవంబర్ 20న వివాహ వేడుకలు ప్రారంభమవుతాయని టైమ్స్ ఎంటర్‌టైన్‌మెంట్ నివేదించింది. 2019లో డేటింగ్ ప్రారంభించిన స్మృతి, పలాష్, జులై 2024లో వీరి ఐదవ వార్షికోత్సవం సందర్భంగా భావోద్వేగ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌ను పంచుకోవడం ద్వారా వారి సంబంధాన్ని బహిరంగపరిచారు. మహారాష్ట్రలోని సాంగ్లీ ప్రాంతం స్మృతి మంధాన సొంత ఊరు. అందుకే ఆమె వివాహ వేడుకలను ఇక్కడి నుంచే ప్రారంభించాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. నవంబర్ 20న వేడుకలు మొదలుకానున్నాయంట. ఇరు కుటుంబాల సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే పాల్గొనే విధంగా ఈ వివాహ వేడుక జరగనుంది. స్మృతి మంధాన, పలాష్ ముచ్ఛల్ సుమారు ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. సోషల్ మీడియాలో వీరిద్దరూ తరచుగా కలిసి దిగిన ఫొటోలు పంచుకుంటూ అభిమానుల దృష్టిని ఆకర్షించారు. ఇటీవల పలాష్ ముచ్ఛల్ స్వయంగా వీరి పెళ్లిని ధృవీకరించారు. ఇండోర్ నుంచి వచ్చిన పలాష్ ముచ్ఛల్%ా% "స్మృతి త్వరలో ఇండోర్‌కు కోడలు కాబోతోంది" అంటూ నవ్వుతూ ప్రకటించారు. ఈ ప్రకటనతో అభిమానులు, క్రికెట్ ప్రియులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.క్రికెట్‌లో తన కవర్ డ్రైవ్‌లు, మెరుపు బ్యాటింగ్‌తో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న స్మృతి మంధాన.. ఇకపై సంగీత ప్రపంచంతో బంధుత్వం కలుపుకోబోతున్నారు. పలాష్ ముచ్ఛల్ బాలీవుడ్‌లో మంచి పేరున్న సంగీత దర్శకుడు. ఆయన సోదరి పాలక్ ముచ్ఛల్ కూడా ప్రముఖ గాయని అన్న విషయం తెలిసిందే.

## జోష్‌లో టీమిండియా

మెల్‌బోర్న్: ఐదు టీ20ల సిరీసలో ఆరంభ మ్యాచ్ వర్షంతో రద్దయిన వేళ.. శుక్రవారం భారత్-ఆస్ట్రేలియా జట్లు మరో పోరుకు సిద్ధమయ్యాయి. ప్రఖ్యాత మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీసీ)లో జరిగే ఈ రెండో టీ20లో నెగ్గి బోణీ చేసేందుకు ఇరుజట్లూ ఎదురుచూస్తున్నాయి. పొట్టి వరల్డ్‌కప్ విజేతగానే కాకుండా ఇటీవలి ఆసియాకప్ టీ20 టోర్నీని గెలిచిన భారత్ బుధవారం నాటి తొలి మ్యాచ్‌ను ఆత్మవిశ్వాసంతో ఆరంభించింది. 9.4 ఓవర్ల ఆటే సాగినా 97/1 స్కోరుతో సరైన ట్రాక్‌లో ఉన్నట్టు కనిపించింది. కెప్టెన్ సూర్యకుమార్ 24 బంతుల్లోనే 39 రన్స్‌తో మునుపటి ఫామ్‌ను అందుకోవడంతో పాటు, హాజెల్‌వుడ్ ఓవర్‌లో ఏకంగా 125మీ. దూరం బాదిన సిక్సర్‌తో ఆసీసను బెదరగొట్టాడు. అటు ఓపెనర్ గిల్ మాత్రం క్రీజులో కుదురుకున్నాడు. మరో ఓపెనర్ అభిషేక్ కాన్‌బెర్రాలో విఫలమైనా.. ఎంసీజీలో చెలరేగాలనుకుంటున్నాడు. మిడిలార్డర్‌లో తిలక్, శాంసన్, దూబే కీలకం కానున్నారు. మరోవైపు ఐదుగురు బ్యాటర్లు, ముగ్గురు ఆల్‌రౌండర్లు, ముగ్గురు బౌలర్లతో తొలి మ్యాచ్ ఆడిన జట్టు నేటి మ్యాచ్‌లోనూ ఇదే కాంబినేషన్‌ను కొనసాగించవచ్చు. అదే జరిగితే పేసర్ అర్ష్‌దీప్ బెంచీకి పరిమితం కాక తప్పదు. అతనికన్నా హర్షిత్ మెరుగైన బ్యాటర్ కావడంతో కోచ్ గంభీర్ అతడి వైపే మొగ్గుచూపుతున్నాడు. అయితే కుల్దీప్, వరుణ్‌లలో ఒక్కరికే చాన్స్ కల్పిస్తే అర్ష్‌దీపను తీసుకోవచ్చు.

ఎదురుదాడే లక్ష్యంగా..: భారత్ తరహాలోనే ఆస్ట్రేలియా కూడా ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగుతోంది. ఓపెనర్లు హెడ్, మార్ష్ మెరుపు ఆరంభాలతో భారీ స్కోరు



అందుకోవాలనుకుంటోంది. ఆ తర్వాత ఇన్‌గ్లిస, డేవిడ్, స్టొయినిస్ బ్యాట్లు ఝుళిపిస్తే భారత బౌలర్లకు కష్టమే. ఇక పేసర్ హాజెల్‌వుడ్‌కు ఈ సిరీసలో ఇదే చివరి మ్యాచ్. రాబోయే యాషెస్ సిరీస్ కోసం అతడికి విశ్రాంతినివ్వనున్నారు. బార్ట్‌లెట్, ఎలిస్, స్పిన్నర్ కునేమన్ బౌలింగ్‌పై ఆధారపడి ఉంది.

**తుది జట్లు (అంచనా)**

భారత్: అభిషేక్, గిల్, సూర్యకుమార్ (కెప్టెన్), తిలక్, శాంసన్, దూబే, అక్షర్, హర్షిత్, కుల్దీప్, వరుణ్, బుమ్రా.

ఆసీస్: హెడ్, మార్ష్ (కెప్టెన్), ఇన్‌గ్లిస, డేవిడ్, ఓవెన్, స్టొయినిస్, ఫిలిప్, బార్ట్‌లెట్, ఎలిస్, కునేమన్, హాజెల్‌వుడ్.

**పిచ్, వాతావరణం**

2022 టీ20 వరల్డ్‌కప్ ఫైనల్ తర్వాత ఎంసీజీలో పొట్టి ఫార్మాట్‌లో జరుగుతున్న మొదటి మ్యాచ్ ఇది. బౌలర్లకు సహకరించే ఈ పిచ్‌పై సగటు స్కోరు 152. అయితే శుక్రవారం కూడా మెరుపులతో కూడిన వాతావరణం ఉండడంతో మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగించే అవకాశం ఉంది.

## జట్టు హెడ్ కోచ్‌గా యువీ!



ఇంటర్నెట్ డెస్క్: త్వరలోనే ఐపీఎల్ 2026సందడి మొదలవ్వనుంది. సీజన్‌కు ముందే తమ కోచింగ్ స్టాఫ్‌లో లక్నోయాజమాన్యం పలు మార్పులు చేసేందుకు సిద్ధమైంది. ఇటీవలే మెంటార్ జహీర్ ఖాన్‌పై వేటు వేసిన లక్నో.. ఇప్పుడు హెడ్ కోచ్ జస్టిస్ లాంగర్‌ను తప్పించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఆండీ ఫ్లవర్ తర్వాత లక్నో ప్రధాన కోచ్‌గా లాంగర్ బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ఆటగాళ్లతో ఆయన సరైన బంధం ఏర్పరచుకోలేకపోయారని పలు నివేదికలు వెల్లడించాయి. దీంతో భారత్‌కు చెందిన మాజీ క్రికెటర్‌కు ఆ బాధ్యతలు అప్పగించాలనే ప్రయత్నంలో లక్నో యాజమాన్యం ఉన్నట్లు సమాచారం.

ారత క్రికెట్ దిగ్గజం, మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్‌కు ఎల్‌ఎస్‌జీ హెడ్ కోచ్ బాధ్యతలు అప్పగించే ప్రయత్నంలో ఫ్రాంచైజీ యాజమాన్యం ఉన్నట్లు తెలుస్తుంది. ఈ విషయంపై ఇప్పటికే యువీతో చర్చలు జరిపినట్లు సమాచారం. యువీ ఇప్పటి వరకు ఏ ప్రొఫెషనల్ జట్టుకు హెడ్ కోచ్‌గా పనిచేయలేదు. కానీ అబుదాబి టీ10 లీగ్‌లో మాత్రం మెంటార్‌గా వ్యవహరించాడు. అయితే పంజాబ్‌కు చెందిన ఎంతో మంది యువ ఆటగాళ్లను మాత్రం తన అనుభవంతో యువీ తీర్చిదిద్దాడు. ప్రస్తుత టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, ప్రియాన్ష్ ఆర్య వంటి ప్లేయర్లు యువీ శిష్యులే.

# అమితాబ్ మనవడి 'ఇక్కీస్'.. ఆకట్టుకుంటున్న ట్రైలర్




బాలీవుడ్‌లో మరో ఆసక్తికరమైన బయోపిక్ రాబోతోంది. దేశ అత్యున్నత సైనిక పురస్కారం 'పరమవీర చక్ర'ను అతి పిన్న వయసులో అందుకున్న వీర సైనికుడు, సెకండ్ లెఫ్టినెంట్ అరుణ్ ఖేతర్‌పాల్ జీవితం ఆధారంగా 'ఇక్కీస్' అనే చిత్రం తెరకెక్కుతోంది. బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ మనవడు అగస్త్య నంద ఈ చిత్రంలో అరుణ్ ఖేతర్‌పాల్ పాత్రను పోషిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది.'అంధాధున్' వంటి విజయవంతమైన చిత్రంతో విమర్శకుల ప్రశంసలు అందుకున్న శ్రీరామ్ రాఘవన్ ఈ బయోపిక్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో దిగ్గజ నటుడు ధర్మేంద్ర, 'పాతాళ్ లోక్' ఫేం జైదీప్ అహ్లావత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. విడుదలైన ట్రైలర్, 1971లో జరిగిన ఇండో-పాక్ యుద్ధ సన్నివేశాలను కళ్లకు కట్టినట్టు చూపిస్తూ సినిమాపై అంచనాలను పెంచుతోంది. యుద్ధభూమిలో అరుణ్ ఖేతర్‌పాల్ చూపిన ధైర్యసాహసాలు, పోరాట పటిమను ట్రైలర్‌లో ఆవిష్కరించారు.కేవలం 21 ఏళ్ల వయసులోనే దేశ రక్షణ కోసం ప్రాణాలను అర్పించిన అరుణ్ ఖేతర్‌పాల్ త్యాగాన్ని ఈ సినిమా గుర్తు చేయనుంది. ఆయన అసమాన పరాక్రమానికి గుర్తింపుగా భారత ప్రభుత్వం మరణానంతరం పరమవీర చక్ర పురస్కారంతో సత్కరించింది. ఎంతో ఆసక్తి రేకెత్తిస్తున్న ఈ చిత్రాన్ని ఈ ఏడాది డిసెంబర్‌లో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.



# కొత్త గెటప్ లో ఆషికా !

ఆషికా రంగనాథ్.. ఈ హీరోయిన్ తెలుగులో చేసినవి 2 సినిమాలే అయినప్పటికీ స్టార్ హీరోయిన్ మాదిరి గుర్తింపు సంపాదించింది.. అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మ కి సంబంధించిన తాజా ఫొటోస్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి.ఎప్పుడు పొట్టి పొట్టి బట్టలతోనో లేక ట్రెడిషనల్ డ్రెస్ లతోనో కనిపించే ఆషికా రంగనాథ్ ఒక్కసారిగా గెటప్ చేంజ్ చేసేసరికి ఈ హీరోయిన్ ఫొటోస్ చూసిన అభిమానులు సైతం షాక్ అవుతున్నారు.ఇదేంటి ఈ హీరోయిన్ గెటప్ మార్చేసింది.. ఈ కొత్త గెటప్ ఏంటో అంటూ ఆశ్చర్యపోతున్నారు.ఇక తాజాగా ఆషికా రంగనాథ్ తన ఇంస్టాగ్రామ్ ఖాతాలో కొన్ని ఫొటోస్ షేర్ చేసింది.ఆ ఫొటోస్ లో ఆషికా రంగనాథ్ గెటప్ పూర్తిగా చేంజ్ అయింది. హాలీవుడ్లో పైరేట్స్ ఆఫ్ ది కరేబియన్ అనే సినిమాలో హీరో ఎలా అయితే ఉంటారో అచ్చం ఆ హీరోని పోలి ఉన్న గెటప్ లో ఆషికా రంగనాథ్ తాజా ఫోటోలు ఉన్నాయి. తలకి బ్యాండ్ కట్టుకొని హెయిర్ లీవ్ చేసుకొని ఆషికా రంగనాథ్ ఫోటోలకు ఫోజులు ఇచ్చింది. ఈ ఫోటోలు చూస్తూ ఉంటే మాత్రం ఆషికా రంగనాథ్ ఏదో స్టంటులు చేసేవారు ఫోటోలకు ఫోజులు ఇచ్చినట్లుగా ఉంది. అంటూ నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు. ఇక ఆషికా రంగనాథ్ పోస్ట్ చేసిన ఫోటోలలో వెనుక ఉన్న బ్యాక్గ్రౌండ్ కూడా అలాగే ఏదో యాక్షన్ మూవీ సెట్ వేసినట్టు కనిపిస్తోంది. చూస్తుంటే ఆషికా రంగనాథ్ కొత్త సినిమా కోసం అలా తన గెటప్ ని చేంజ్ చేసినట్టు కనిపిస్తోంది. మరి ఆషికా రంగనాథ్ తాజా ఫొటోస్ కొత్త సినిమా గెటప్ లో భాగమేనా అనేది తెలియాల్సి ఉంది.

ఇక ఈ ఫొటోస్ షేర్ చేయడంతో పాటు ఈ ఫొటోస్ కి క్యాప్షన్ గా ఈ మొత్తం లుక్ వెనక ఉన్న బృందానికి లవ్ యు అన్నట్లుగా ఫింగర్ హార్ట్ సింబల్ ఎమోజిని కూడా షేర్ చేసింది.. ప్రస్తుతం ఆషికా రంగనాథ్ కి సంబంధించిన తాజా ఫొటోస్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి.మరి హీరోయిన్ సడెన్ గా గెటప్ చేంజ్ వెనుక కారణం ఏంటో తెలియాల్సి ఉంది.



# అలా చెప్పుకోవడం నాకు ఇష్టం ఉండదు: రవితేజ

రవితేజ కథానాయకుడిగా భాను భోగవరపు దర్శకత్వంలో 'మాస్ జాతర' సినిమా రూపొందింది. శ్రీలీల కథానాయికగా నటించిన ఈ సినిమా, రేపు విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా టీమ్ ప్రమోషన్స్ లో బిజీగా ఉంది. తాజా ఇంటర్వ్యూలో భాను భోగవరపు మాట్లాడుతూ, "నేను రవితేజ గారి అభిమానిని. అయన సినిమాలలో నాకు 'వెంకీ' అంటే చాలా ఇష్టం. ఆయనతోనే నా ఫస్టు మూవీ ఉంటుందని నేను అసలు ఊహించలేదు" అని చెప్పారు. ఈ సినిమాకి 'మాస్ జాతర' అనే టైటిల్ పెట్టింది రవితేజ గారే. ఇది సాలిడ్ టైటిల్ కావడంతో, అందుకు తగినట్టుగా సీన్స్ ను డిజైన్ చేసుకోవడం జరిగింది. ఈ సినిమా తప్పకుండా పెద్ద హిట్ అవుతుందనే నమ్మకం ఉంది" అని అన్నారు. ఇక హైపర్ ఆది మాట్లాడుతూ .. 'ధమాకా' తరువాత నుంచి రవితేజ గారి సినిమాలలో వరుసగా చేస్తూ వెళుతున్నాను. ఈ సినిమాలు రవితేజగారితో కలిసి నేను చేసే కామెడీ ఆడియన్స్ కి నచ్చుతుంది" అని అన్నారు. ఇక రవితేజ మాట్లాడుతూ .. " వేరే ఏ విషయం గురించి మాట్లాడమని చెప్పినా మాట్లాడతాను. కానీ నా గురించి .. నా సినిమాను గురించి మాట్లాడటం నాకు ఇష్టం ఉండదు. ఇలా వచ్చేస్తున్నాయ్ .. అలా వచ్చేస్తున్నాయ్ .. బాగా వచ్చేస్తున్నాయ్ అన్ని నేను చెప్పలేను. భాను డైరెక్షన్ .. అతని రైటింగ్ ఈ సినిమాకి హైలైట్ గా నిలుస్తుందనేది మాత్రం నిజం. ఒకటి మాత్రం చెప్పగలను .. మనకి మరో కమర్షియల్ డైరెక్టర్ వస్తున్నాడు" అని అన్నారు.

# హైదరాబాద్‌లో ఏఆర్ రెహమాన్ లైవ్ కాన్సర్ట్

ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ మరోసారి హైదరాబాద్ సంగీత ప్రియులను తన స్వరాలతో అలరించనున్నారు. నవంబర్ 8న రామోజీ ఫిల్మ్ సిటీ వేదికగా ఆయన భారీ లైవ్ కాన్సర్ట్ నిర్వహించబోతున్నారు. హైదరాబాద్ టాకీస్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను నిర్వాహకులు అధికారికంగా ప్రకటించారు. ఈ వార్తతో రెహమాన్ అభిమానుల్లో భారీ ఉత్సాహం నెలకొంది.ఈ సందర్భంగా ఏఆర్ రెహమాన్ మాట్లాడుతూ, "హైదరాబాద్ అత్యంత డైనమిక్ నగరంగా అభివృద్ధి చెందుతోంది. ఇక్కడి ప్రజలు లైవ్ కాన్సర్ట్‌లను ఎంతగానో ఆదరిస్తున్నారు. ఏఐ ప్రభావం పెరుగుతున్న ఈ రోజుల్లో కూడా ప్రేక్షకులు నిజమైన సంగీత అనుభూతి కోసం ఇలాంటి కార్యక్రమాలకు రావడం కళాకారులకు ఎంతో ప్రోత్సాహాన్నిస్తుంది" అని అన్నారు. ఇది సంగీతం పట్ల ప్రజలకు ఉన్న ప్రేమకు నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు.హైదరాబాద్ టాకీస్ వ్యవస్థాపకుడు సాయినాథ్ గౌడ్ మాట్లాడుతూ, "ప్రేక్షకులకు ప్రపంచ స్థాయి సంగీత అనుభవాన్ని అందించడమే మా లక్ష్యం. ఈ ఏడాది ఆరంభంలో ఎం.ఎం. కీరవాణితో కార్యక్రమం నిర్వహించాం. ఇప్పుడు రెండోసారి ఏఆర్ రెహమాన్‌ను నగరానికి తీసుకురావడం గర్వంగా ఉంది. ఈ ఈవెంట్ కోసం దీపక్ చౌదరి, ఇవా లైవ్ సంస్థలతో కలిసి పనిచేస్తున్నాం" అని తెలిపారు.భారతీయ సంగీతాన్ని ప్రపంచ వేదికలపై వినిపించిన రెహమాన్, తన లైవ్ ప్రదర్శనలతో ఇప్పటికే ఎంతో మందిని మంత్రముగ్ధులను చేశారు. ఇప్పుడు హైదరాబాద్‌లో జరగబోయే ఈ సంగీత విభావరిలో ఆయన తన కెరీర్‌లోని ఎన్నో సూపర్ హిట్ గీతాలను ప్రత్యక్షంగా ఆలపించనున్నారు. దీంతో నవంబర్ 8న రామోజీ ఫిల్మ్ సిటీ రెహమాన్ స్వరాలతో మార్మోగడం ఖాయంగా కనిపిస్తోంది



# రష్మిక మందన్నకు మరో హిట్.. వంద కోట్ల క్లబ్ లో చేరిన బాలీవుడ్ మూవీ

పాన్ ఇండియా హీరోయిన్ రష్మిక మందన్న మరో హిట్ సినిమాను తన ఖాతాలో వేసుకుంది. బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా, రష్మిక జంటగా నటించిన హారర్ కామెడీ చిత్రం 'థమ్మా' బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధిస్తోంది. సెప్టెంబర్ 21న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, 100 కోట్ల క్లబ్ లో చేరింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, 9వ రోజు (అక్టోబర్ 29న) ఈ చిత్రం కేవలం రూ. 3.25 కోట్లు వసూలు చేసింది. దీంతో సినిమా మొత్తం వసూళ్లు రూ. 104.60 కోట్లకు చేరాయి. రెండో బుధవారం హిందీలో ఈ చిత్రానికి 10.10% ఆక్యుపెన్సీ నమోదైంది. ఉదయం షోలకు 6.28% ఆక్యుపెన్సీ ఉండగా, రాత్రి షోలకు అత్యధికంగా 13.96% నమోదైనట్లు నివేదికలు చెబుతున్నాయి.ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని దినేశ్ విజన్, అమర్ కౌశిక్ మ్యాడాక్ ఫిలింస్ బ్యానర్‌పై నిర్మించారు. 'స్త్రీ', 'స్త్రీ 2', 'భేదియా', 'ముంజ్యా' చిత్రాల తర్వాత మ్యాడాక్ హారర్ కామెడీ యూనివర్స్‌లో వచ్చిన ఐదో సినిమా ఇది. ఇందులో అలోక్ గోయల్ అనే జర్నలిస్టు పాత్రలో ఆయుష్మాన్ ఖురానా నటించగా, రక్తపిశాచి (వాంపైర్) అయిన తాడక పాత్రలో రష్మిక మందన్న కనిపించింది. వీరిద్దరి మధ్య నడిచే విభిన్నమైన ప్రేమకథే ఈ సినిమా.ఈ చిత్రం తన కెరీర్‌లోని అతిపెద్ద కమర్షియల్ హిట్స్‌లో ఒకటిగా నిలవడంపై హీరో ఆయుష్మాన్ ఖురానా ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఈ సినిమా పిల్లలను బాగా ఆకట్టుకోవడం తనను ఎంతగానో సంతోషపరిచిందని ఆయన అన్నారు. "థమ్మాలో నాకు బాగా నచ్చిన విషయం ఏంటంటే, ఇది పిల్లలకు నచ్చడం. నా కెరీర్‌లో పిల్లలు ఇష్టపడిన మొదటి సినిమా ఇదే. ఈ సినిమాలోని స్పెషల్ ఎఫెక్ట్స్, కథనం పిల్లలకు అనుకూలంగా ఉంటాయి. నా పిల్లలకు కూడా ఈ సినిమా బాగా నచ్చింది" అని తెలిపారు. ఈ చిత్రంలో పరేశ్ రావల్, నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఫైసల్ మాలిక్, గీతా అగర్వాల్ శర్మ వంటి నటులు కీలక పాత్రలు పోషించారు.





# బైకర్తో శర్వా మాస్టర్ ప్లాన్!

'చార్మింగ్ స్టార్' శర్వానంద్ చాలా కాలంగా ఒక సాలిడ్ హిట్ కోసం గట్టిగా ట్రై చేస్తున్నాడు. 'ఒకే ఒక జీవితం' పర్వాలేదనిపించినా, ఆయన రేంజ్‌కు తగ్గ బ్లాక్‌బస్టర్ మాత్రం ఇంకా పడలేదు. రొటీన్ కథలు, ఫ్యామిలీ డ్రామాలు వర్కవుట్ అవ్వకపోవడంతో, శర్వా ఈసారి రూట్ మార్చినట్లున్నాడు. తన కంఫర్ట్ జోన్ నుంచి పూర్తిగా బయటకు వచ్చి, 'బైకర్' అనే ఒక క్రేజీ ప్రాజెక్ట్‌తో రాబోతున్నాడు.ఈ సినిమా కోసం శర్వా డెడికేషన్ నెక్స్ట్ లెవల్‌లో ఉంది. కేవలం కథ నచ్చి ఓకే చెప్పడమే కాదు, ఆ పాత్ర కోసం తనను తాను పూర్తిగా మార్చుకున్నాడు. 'బైకర్' లుక్ కోసం బరువు తగ్గి, చాలా లీన్‌గా తయారయ్యాడు. అంతేకాదు, ఇది రెగ్యులర్ యాక్షన్ కాదు, 'డర్ట్ బైక్ యాక్షన్' కావడంతో, ఏకంగా మూడు నెలల పాటు స్పెషల్ ట్రైనింగ్, డైట్, జిమ్‌తో కష్టపడ్డాడని సమాచారం.ఈ సినిమాతో అభిలాష్ రెడ్డి కంకర దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. యూవీ క్రియేషన్స్ లాంటి బడా సంస్థ ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తుండటంతో, టెక్నికల్‌గా సినిమా చాలా రిచ్‌గా ఉండబోతోందని అర్థమవుతోంది. తెలుగు సినిమాకు 'డర్ట్ బైక్ రేసింగ్' అనేది చాలా కొత్త జానర్. శర్వా ఈ రిస్క్ తీసుకోవడమే ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్.అయితే, ఈ కొత్త జానర్‌ను ఆడియెన్స్‌కు కరెక్ట్‌గా ఎక్కించడానికి మేకర్స్ ఒక మాస్టర్ ప్రమోషనల్ ప్లాన్ వేశారు. 'బైకర్' నుంచి "ఫస్ట్ ల్యాప్ గ్లింప్స్" పేరుతో ఒక టీజర్‌ను రెడీ చేశారు. కానీ, దాన్ని నేరుగా యూట్యూబ్‌లో వదలడం లేదు. ఇది చాలా స్మార్ట్ మూవ్. ఈ గ్లింప్స్‌ను అక్టోబర్ 31 నుంచి థియేటర్లలో రిలీజ్ చేయబోతున్నారు. అది కూడా ఈ వారం బాక్సాఫీస్‌ను షేక్ చేయడానికి రెడీగా ఉన్న 'బాహుబలి: ది ఎపిక్' రీ-రిలీజ్‌తో పాటు, రవితేజ 'మాస్ జాతర' సినిమా షోలతో పాటు దీన్ని అటాచ్ చేశారు.